
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 3 నవంబరు 2024



స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం
సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇచ్చి పాలన సాగిస్తున్నాం
» విశాఖను టీడీపీకి కంచుకోటగా నిలబెట్టారు... కార్యకర్తలకు రుణపడి ఉంటా · 8లో
» సభ్యత్వ నమోదు అనంతరం కమిటీల నియామకం
» పార్టీ కార్యాలయంలో సీఎం నారా చంద్రబాబునాయుడు



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రులు జనార్దనరెడ్డి, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

నక్కపల్లిలో స్టీల్ ఫ్యాక్టరీ

రూ.70 వేల కోట్లతో ఏర్పాటుకు సంసిద్ధం

» కరువు రహిత జిల్లాగా అనకాపల్లి
» రెండేళ్లలో అనకాపల్లి, విశాఖ జిల్లాలకు గోదావరి జలాలు
» విశాఖ స్టీల్‌ప్లాంట్ లాభాల బాట పట్టేలా చర్యలు
» సీఎం చంద్రబాబునాయుడు

అనకాపల్లి/ పరవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి ఎస్‌ఈజెడ్‌లో రూ.70 వేల కోట్ల పెట్టుబడులు పెట్టి స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు మిట్టల్ సంస్థ ముందుకొచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. పరిశ్రమ ఏర్పాటు జరిగితే నక్కపల్లి పారిశ్రామిక ప్రాంతంగానే కాకుండా ఒక నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పరవాడ సినిమా హాల్ జంక్షన్‌లో శనివారం జరిగిన మిషన్ ఫర్ పాట్ హోల్‌ఫ్రీ రోడ్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పరవాడ సినిమా హాల్ జంక్షన్ నుంచి అచ్యుతాపురం వెళ్లే రోడ్డుపై పడిన గోతులు పూడ్చే పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన స్వయంగా రోడ్డు రోలర్ నడిపి గుంతలు పూడ్చే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి, అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి ద్వారా కరువు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రానున్న రెండేళ్లలో పోలవరం పూర్తిచేసి ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లి, విశాఖ జిల్లాలకు అందిస్తామని సీఎం ప్రకటించారు. ఇప్పటికే పోలవరం ఎడమ కాలువ పనులు జరుగుతున్నాయన్నారు. అనకాపల్లి ప్రజలు నీతికి, నిజాయితీకి మారుపేరని నిరూపించారని, మూడు రాజధానులు అనే పేరుతో గత ప్రభుత్వం మోసం చేయాలని చూసినా మూడు రాజధానులు మాకొద్దని, అభివృద్ధి ముద్దని తీర్పు ఇచ్చారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఆంధ్రుల మనోభావాలకు సంబంధించిన ప్రాజెక్టు అని వ్యాఖ్యానించారు. దీన్ని లాభాల బాటలో నడిపించేలా అవసరమైన చర్యలు చేపట్టేందుకు కేంద్రంతో చర్చిస్తామన్నారు.



రహదారి గోతులు పూడ్చివేత పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

టీ చేయడం నేర్చుకున్నా..

దీపం-2 పథకంలో మహిళలకు ఉచితంగా వంట గ్యాస్ సిలిండర్లను అందించే కార్యక్రమం ద్వారా తాను కూడా టీ చేయడం నేర్చుకున్నట్టు చంద్రబాబు చెప్పారు. మగవారంతా ఉద్యోగానికి వెళ్లి ఇంటికి వచ్చిన తమ భార్యలకు టీ చేసి ఇవ్వడం ద్వారా వారిని తమతో సమానంగా గౌరవించవచ్చని వ్యాఖ్యానించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ పరవాడ మండలంలో తీవ్రమైన కాలుష్యంతో దీర్ఘకాలంగా బాధపడుతున్న తాడి, స్వయంభూవరం గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. స్థానికులకు ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు.



విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో మూడు జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు

విశాఖకు ఔటర్ రింగ్

విజయనగరం, భోగాపురం, అనకాపల్లి పట్టణాలను కలుపుతూ నిర్మాణం

» ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా అధికారులకు ముఖ్యమంత్రి
» నారా చంద్రబాబునాయుడు ఆదేశం
» విశాఖలో పర్యాటక రంగ అభివృద్ధికి పెద్దపీట వేయాలి
» విశాఖ అవసరాలు తీర్చేలా అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పంటల సాగు
» సంక్రాంతి తరువాత రోడ్లపై ఎక్కడైనా గుంతలు కనిపిస్తే సంబంధిత అధికారిని సస్పెండ్ చేస్తా
» విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల సమీక్షలో సీఎం నారా చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరాన్ని కలుపుతూ విజయనగరం, నెల్లిమర్ల, భోగాపురం, అనకాపల్లి పట్టణాలకు ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. హైదరాబాద్ మాదిరిగా విశాఖను అభివృద్ధి చేయాలన్నారు. విశాఖ కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల సమీక్షా సమావేశంలో అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు, వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్, నీతి అయోగ్ గ్రోత్ హబ్, రహదారుల అనుసంధానం, తదితర అభివృద్ధి పనుల్లో పీపీపీ విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అధికారులంతా హార్డ్ వర్క్ చేయకుండా స్మార్ట్‌గా పనిచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. విశాఖలో పర్యాటక రంగ అభివృద్ధికి పెద్దపీట వేయాలన్నారు. ఎక్కడి నుంచైనా పర్యాటకులు వస్తే వారం రోజులు ఇక్కడే ఉండేలా ఆకర్షణీయమైన ప్రాజెక్టులు రూపొందించాలని ఆదేశించారు. అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల కోసం దేశ, విదేశాల్లో అధ్యయనం జరగాలన్నారు. నాలెడ్జ్ ఎకానమీలో భాగంగా 2026లో... మిగతా 8వ పేజీలో



చంద్రబాబును సన్మానించిన ఎమ్మెల్యేలు పంచకర్ల, బండారు, కొణతాల, విష్ణుకుమార్‌రాజు

గాజుల అలంకరణలో భూలోకమాంబ



ఎలమంచిలి తులసీనగర్‌లో గాజుల అలంకరణలో దర్శనమిస్తున్న భూలోకమాంబ అమ్మవారు

ఎలమంచిలి తులసీనగర్‌లోని భూలోకమాంబ అమ్మవారు శనివారం గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పంచరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. - ఎలమంచిలి/ఆంధ్రజ్యోతి

కూరగాయల మార్కెట్‌లో కారు బీభత్సం

ఆటోను ఢీకొని జనం మీదకు దూసుకుపోయిన వైనం

» భీతిల్లిన వ్యాపారులు, వినియోగదారులు
» డౌనూరు నుంచి గంజాయితో వస్తున్న కారును పోలీసులు వెంబడించడంతో ఘటన
» ముగ్గురు యువకుల పరారీ
» పోలీసుల అదుపులో డ్రైవర్



కూరగాయల మార్కెట్లో బీభత్సం సృష్టించిన కారు

నర్సీపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): **స్థానిక కూరగాయల మార్కెట్లో ఓ కారు శనివారం ఉదయం బీభత్సం సృష్టించింది. అతి వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. అక్కడున్న వారిపై దూసుకురావడంతో భయభ్రాంతులకు గురయ్యారు. గంజాయితో డౌనూరు నుంచి నర్సీపట్నం వైపు అతివేగంగా వస్తున్న కారును పోలీసులు వెంబడించిన క్రమంలో ఈ సంఘటన చోటుచేసుకుంది.**

సరిగ్గా ఉదయం 7.30 గంటలు.. శనివారం సంత కావడంతో కూరగాయల మార్కెట్ కిటకిటలాడుతోంది. రోడ్డుకు ఇరువైపులా నేలపై కూరగాయల దుకాణాలు ఉన్నాయి. వర్తకులు, వినియోగదారులు ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నారు. ఇంతలో ఓ కారు అతివేగంగా దూసుకొచ్చి ఆటోను ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడి దట్టంగా పొగలు వ్యాపించాయి. ఆటో దగ్ధమవుతుందేమోనని అందరూ ఆందోళన చెందారు. అంతటితో ఆగకుండా కారు ముందుకు వెళుతుండడంతో జనం కేకలు వేసుకుంటూ దానిని వెంబడించారు. ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో డ్రైవర్ కారును రోడ్డు మధ్యలో ఆపేశాడు. కారులోంచి ముగ్గురు యువకులు దిగి పంట పొలాల్లోకి పారిపోయారు. డ్రైవింగ్ సీట్లో ఉన్న యువకుడు కూడా పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. డ్రైవర్ సీటు కింద గంజాయి ఉందని అక్కడి వారు చర్చించుకున్నారు.

డౌనూరు నుంచి వెంబడించిన పోలీసులు

చింతపల్లి వైపు నుంచి అనుమానాస్పదంగా వస్తున్న కారును డౌనూరు చెక్ పోస్టు వద్ద స్పెషల్ పార్టీ పోలీసులు ఆపడానికి ప్రయత్నించారు. డ్రైవర్ ఆపకుండా వాహనాన్ని వేగంగా ముందుకు పోనిచ్చాడు. పోలీసుల మీదకు కారు దూసుకు వచ్చింది. అయినా పట్టు వదలకుండా పోలీసులు ... మిగతా 8వ పేజీలో

ఆగని ఇసుక దందా

ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీని దుర్వినియోగం చేస్తున్న అక్రమార్కులు

» నదీ పరీవాహక ప్రాంతాల్లో దర్జాగా తవ్వకుని తరలింపు
» కొంత దూరంలో నిల్వ చేసి అమ్మకాలు
» పట్టించుకోని అధికారులు



మండలంలోని గొటివాడ అగ్రహారంలో ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

మాడుగుల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ పెట్టిన తరువాత అక్రమార్కులు బరితెగిస్తున్నారు. సొంత అవసరాలకు అని చెప్పి మండలంలోని నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకుని టైరుబండ్ల సహాయంతో ఒడ్డుకు చేరుస్తున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్లు, లారీల్లో తరలించి కొంత దూరంలో నిల్వ చేస్తున్నారు. ఆ తరువాత దర్జాగా విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారం తెలిసినా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

మండలంలోని తాచేరు కాలువ, సత్యవరం, దొర్ల గొటివాడ, వీవీ అగ్రహారం, వీరనారాయణం, ఎం.కోటపాడు, జంపెన, గొటివాడ అగ్రహారం, పోతనపూడి వంటి నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ వ్యాపారులు దర్జాగా తవ్వకాలు సాగిస్తున్నారు. ఇసుక తరలించే వారి దగ్గర ఈ-ట్రాన్సిట్ రిపోర్టు ఉండాలని, ప్రతీ వాహనానికి జీపీఎస్ ఉండాలని, అలా కాకుండా సొంత అవసరాలకని చెప్పి అక్రమంగా తరలిస్తే వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామని తరచూ హెచ్చరించే జిల్లా అధికారులు మండలంలో నిత్యం ఇసుక తవ్వి తరలించుకుపోతున్న వారిపై ... మిగతా 8వ పేజీలో

మెట్రోకెమ్ ఫార్మాలో పేలుడు

» రియాక్టర్ మ్యాన్‌హోల్ ఓపెన్ కావడంతో ప్రమాదం
» పరుగులు తీసిన కార్మికులు

పరవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల ఫార్మాసిటీలోని మెట్రో కెమ్ (ఏపీఐ) ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో శనివారం రాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ సంఘటనకు సంబంధించి కార్మికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-ఏలో రాత్రి తొమ్మిది గంటలకు రియాక్టర్ మ్యాన్‌హోల్ రసాయనాల ఒత్తిడికి గురై ఓపెన్ అయ్యింది. రసాయనాలు ఒక్కసారిగా బయటకు తుళ్లిపడడంతో మంటలు వ్యాపించాయి. దీంతో బ్లాక్ వద్ద పనిచేస్తున్న కార్మికులంతా భయాందోళనతో అక్కడి నుంచి పరుగులు తీశారు. పేలుడు ధాటికి బ్లాక్‌లోని కిటికీ అద్దాలన్నీ పగిలి పక్కనే ఉన్న రోడ్డుపైకి వచ్చి పడ్డాయి. సుమారు 20 నిమిషాలకు పైగా మంటలు ఎగిసిపడ్డాయి. ముందస్తు చర్యల్లో భాగంగా యాజమాన్యం విద్యుత్ సరఫరాను నిలిపివేసింది. సమాచారం అందుకున్న రాంకీ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేసింది. అయితే ఈ ప్రమాదంలో కార్మికులు ఎవరికీ గాయాలు కాలేదని హెచ్‌ఆర్ ప్రతినిధి తేజ స్థానిక విలేకరులకు తెలిపారు. అయితే ప్రమాద తీవ్రత దృష్ట్యా ... మిగతా 8వ పేజీలో



మెట్రోకెమ్ ఫార్మా కంపెనీ లోపల నుంచి ఎగిసిపడుతున్న మంటలు



కంపెనీ వద్ద గుమిగూడిన కార్మికులు, స్థానికులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

» మరొకరికి తీవ్ర గాయాలు
» ముందు వెళుతున్న గేదెలను తప్పించబోతుండగా అదుపు తప్పిన బైక్
» రోడ్డుపై పడడంతో వారి పైనుంచి దూసుకుపోయిన లారీ



మేరుగు మహాలక్ష్మి (ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం- పూడిమడక రోడ్డులో శనివారం సాయంత్రం జర్గిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. దీనికి సంబంధించి సీఐ నమ్మి గణేశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పూడిమడక శివారు కడపాలేనికి చెందిన మేరుగు మహాలక్ష్మి(21), యజ్జల కిరణ్(18) బైక్‌పై అచ్యుతాపురం నుంచి పూడిమడక వెళుతున్నారు. అచ్యుతాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న గేదెలను తప్పించే ప్రయత్నంలో ఉండగా ఒక గేదె అకస్మాత్తుగా కుడి పక్కకు వచ్చింది. గేదెను తప్పించబోయి బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడిపోయారు. ఈలోగా వెనుక నుంచి వస్తున్న లారీ వీరి పైనుంచి దూసుకుపోయింది. దీంతో వాహనం ... మిగతా 8వ పేజీలో

ఎలమంచిలి కాంగ్రెస్ ఇన్‌చార్జిగా 'తనకాల'



అనంతరావు నర్సింగరావు

అచ్యుతాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎలమంచిలి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా అచ్యుతాపురం మండలానికి చెందిన తనకాల అనంతరావు నర్సింగరావు నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. తిమ్మరాజుపేటకు చెందిన ఈయన ఆది నుంచి కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తగా మొదలై మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గం నుంచి టిక్కెట్టు ఇవ్వడంతో పోటీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. పీసీసీ అధ్యక్షురాలితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

మూలకొత్తూరులో పాల సేకరణ కేంద్రం ఏర్పాటు



హెరిటేజ్ డెయిరీ పాలసేకరణ కేంద్రం ప్రారంభోత్సవంలో రైతులు

రాంబిల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మూలకొత్తూరు గ్రామంలో హెరిటేజ్ డెయిరీ నూతన పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించింది. సంస్థ మేనేజర్ కూండ్రపు శేషు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు డెయిరీ అన్నింటా ప్రోత్సహిస్తుందన్నారు. పాలు పోసే రైతుల సౌకర్యార్థం ప్రతి గ్రామంలో పశువులకు కృత్రిమ గర్భధారణ అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపాలెంలో విద్యుత్ సమస్యకు పరిష్కారం



గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు దృశ్యం

ఎలమంచిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పోతిరెడ్డిపాలెంలో ఎట్టకేలకు విద్యుత్‌లో వోల్టేజీ సమస్యకు పరిష్కారం లభించింది. ఇక్కడ గత కొంత కాలంగా ఈ సమస్య ఉండేది. దీంతో విద్యుత్, ఎలక్ట్రానిక్ పరికరాలు తరచూ పాడవుతుండేవి. ఇది గుర్తించిన సర్పంచ్ ఇత్తం శెట్టి సన్యాసినాయుడు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ మేరకు శనివారం ఈపీడీసీఎల్ ఏఈ కనకరాజు సిబ్బందితో కలిసి గ్రామంలో సర్పంచ్ పర్యవేక్షణలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు.

ఎలమంచిలిలో ఎటు చూసినా సందడే

▸ వైభవోపేతంగా పాంచరాత్ర ఉత్సవాలు ▸ విద్యుద్దీప కాంతులతో పట్టణం ధగధగ ▸ పెద్ద సంఖ్యలో దేవతామూర్తులను దర్శించుకుంటున్న భక్తజనం



తులసీనగర్‌లో పూజలు అందుకుంటున్న భూలోకమాంబ



భక్తులతో కోలాహలంగా ఉన్న భూలోకమాంబ అమ్మవారి ఆలయ పరిసరాలు



పాత వీధిలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఎలమంచిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పాంచరాత్రి ఉత్సవాలు పట్టణంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. దీపావళి రోజున ప్రారంభమైన ఈ వేడుకలు నాగుల చవితి రోజు వరకు కొనసాగనున్నాయి. దీంతో తులసీనగర్‌లోని భూలోకమాంబ, పాతవీధిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. ప్రతి రోజూ వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమవుతున్నాయి. రాత్రి పది గంటల వరకు భక్తులు విచ్చేస్తూ దేవతామూర్తులను దర్శించుకుంటున్నారు ఈ సందర్భంగా ఏర్పాటైన విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఎలమంచిలిలో ఎట్నుంచి ఎటు వెళ్లినా విద్యుద్దీప కాంతులతో ధగధగలాడుతున్నాయి. ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన వేంకటేశ్వర స్వామి సెట్, అయోధ్యరాముని సెట్, సుబ్రహ్మణ్యేశ్వరస్వామిల సెట్టింగ్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. భక్తులకు ఆటవిడుపు కలిగించేందుకు గురవప్ప కల్యాణ మండపం ఆవరణలో జెయింట్ వీల్ తదితరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, ఆలయ ధర్మకర్త పిళ్లా రమాకుమారి ఆధ్వర్యంలో రెండు ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ



చంద్రబాబును కలిసి 'ప్రగడ'



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రగడ

ఎలమంచిలి/ అచ్యుతాపురం, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): పరవాడ విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శనివారం టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతంగా నిర్వహించాలని చంద్రబాబు సూచించినట్టు ప్రగడ ఇక్కడి విలేకరులకు తెలిపారు.

డ్రగ్స్ నిర్మూలనకు 2కె, 5కె రన్

అచ్యుతాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా త్వరలో 2కె, 5కె రన్ నిర్వహించేందుకు ఇక్కడి ప్రశాంతి విద్యాసంస్థల విద్యార్థులు నిర్ణయించారు. ఇందులో పాల్గొని ప్రతిభ చూపేవారికి బహుమతులు కూడా అందించనున్నారు. ప్రథమ బహుమతి రూ.ఐదు వేలు, ద్వితీయ బహుమతి రూ.మూడు వేలు, తృతీమ బహుమతి రూ.రెండు వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ రన్‌లో పాల్గొనదలచినవారు 83319, 45611, 95538 89030 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

'అభిజిత్'ను తెరిపించేందుకు సీఎం చొరవ చూపాలి

▸ అచ్యుతాపురం జంక్షన్‌లో సంస్థ కార్మికుల ఆందోళన



అచ్యుతాపురం జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న అభిజిత్ కర్మాగారం కార్మికులు

అచ్యుతాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సెజ్‌లో గల అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారాన్ని తెరిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని సంస్థ కార్మికులు కోరారు. ఈ మేరకు శనివారం అచ్యుతాపురంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరవాడ వచ్చిన ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం అందించేందుకు తామంతా ప్రయత్నించగా, అచ్యుతాపురం జంక్షన్‌లోనే బారికేడ్లు కట్టి ఆపేశారని వారు ఆరోపించారు. గత 21 రోజులుగా సమస్యపై వివిధ రూపాల్లో పోరాటాన్ని సాగిస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. నేరుగా తమ సమస్యను సీఎంకు చెప్పుకునే అవకాశం ఇవ్వలేదని వాపోయారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాల్సిందిగా వారంతా కోరారు.

తులసీనగర్‌లో కొలువుదీరిన గౌరీ పరమేశ్వరులు



గౌరీపరమేశ్వరులకు పూజలు నిర్వహిస్తున్న రమాకుమారి దంపతులు

ఎలమంచిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తులసీనగర్‌లో శనివారం గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి దంపతులు తొలుత ఆది దంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీపరమేశ్వరుల మండపంలో ఏటా కార్తీకమాసంలో ఈ వేడుకలు నిర్వహిస్తుండడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ సతీమణి జయలక్ష్మి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు మళ్ల కొండబాబు, ఆడారి రమణ, లీలా కుమారిలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

10 నుంచి ఇంటింటా ధర్మరక్షా దినోత్సవాలు

▸ సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి రమణ

అచ్యుతాపురం నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా ఈ నెల పదో తేదీ నుంచి ఇరవై వరకు ప్రతి ఇంటా ధర్మరక్షా దినోత్సవాలు జరుపుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ఎలమంచిలి డివిజన్ ఇన్‌చార్జి బీవీ రమణ తెలిపారు. కొండకర్ల రామాలయంలో శనివారం జరిగిన సభ్యుల సమావేశంలో మాట్లాడారు. ఈ దైవ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహనకు గ్రామాల్లో ధార్మిక కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో దేవాలయాలు కేంద్రంగా ప్రతి వారం భజనలు, పౌర్ణమి పర్వదినాల్లో సామూహిక హారతులు వంటివి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు, గుడివాడ రమణ, సన్నిధి ఈశ్వరరావు, కోసూరి భాను ప్రసాద్, కందుల భవానీ, కంఠంరెడ్డి ఆదిలక్ష్మి, రేవతి తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో సమావేశమైన సంస్థ ప్రతినిధులు

'అక్రమ ఇసుక లారీలకు జరిమానా'

అచ్యుతాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం నుంచి అక్రమంగా అచ్యుతాపురానికి ఇసుక రవాణా చేసిన లారీలకు జరిమానా విధించినట్టు తహసీల్దార్ జీవీ జనార్ధన్ తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి ఐదు లారీలను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇందులో ఒక లారీకి రూ.పది వేలు, రెండు లారీలకు పదిహేను వేలు చొప్పున, మిగిలిన రెండు లారీలక రూ.20 వేలు చొప్పున జరిమానా వేసినట్టు చెప్పారు. కాగా మండలంలో ఎక్కడ ఇసుక అక్రమ రవాణా జరిగినా వెంటనే తమకు తెలియజేయాల్సిందిగా వీఆర్వోలను ఆదేశించామని ఆయన వివరించారు.

ఎర్రన్నాయుడుకు నివాళి

అచ్యుతాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు వర్ధంతిని శనివారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు రవిరాజు, ఎరిపిల్లి చిట్టిబాబు, యాండ్ర అప్పలనాయుడు, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, గూడేల కనకారావు, బుద్ద వెంకట రమణ, గరికిన గోవింద్, కొవిరి బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సర్వేపై శిక్షణ



స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

నక్కపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు శనివారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో డి.సీతారామరాజు ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే గురించి ఎంపీడీవో వివరించారు. టెక్నికల్ సిబ్బంది సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సంపద కేంద్రం వద్ద పారిశుధ్య పనులు

నక్కపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొడిచెర్లలో సంపద తయారీ కేంద్రాన్ని శనివారం ఎంపీడీవో డి.సీతారామరాజు తనిఖీ చేశారు. సంపద కేంద్రం వద్ద తుప్పలు తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. సచివాలయ పారిశుధ్య సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు తుప్పలు తొలగించే పనులు చేపట్టారు. సంపద కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, తడి-పొడి చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి, సంపద కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. అనంతరం వేంపాడు సంపద కేంద్రాన్ని కూడా ఆయన తనిఖీ చేశారు.

రహదారి మరమ్మతు పనులకు శ్రీకారం



శంకుస్థాపన చేస్తున్న కూటమి నాయకులు

నక్కపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేట నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రహదారుల మరమ్మతు పనులను త్వరలో పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్టు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ చెప్పారు. మండలంలోని ఉద్దండపురం నుంచి తిరుపతిపాలెం రహదారి మరమ్మతు పనులకు శనివారం కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వైబోయిన రమణ, మేరుగు నాగేశ్వరరావు, నానేపల్లి రాఘవులు,గింజాల లక్ష్మణరావు, రమేశ్, వెలగా సుధాకర్, నల్ల రత్నాజీ పాల్గొన్నారు.

అత్యధిక టీడీపీ సభ్యత్వ నమోదు లక్ష్యం

పాయకరావుపేట రూరల్, అక్టోబరు2(ఆంధ్రజ్యోతి):- అత్యధిక సభ్యత్వ నమోదు చేయడమే లక్ష్యంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టిడిపి మండల అధ్యక్షులు పెదిరెడ్డి ట్టిబాబు అన్నారు. మండలంలోని సత్యవరం గ్రామంలో శనివారం టిడిపి నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి క్రియాశీలక సభ్యులకు టిడిపి పార్టీ 5 లక్షల ఉచిత భీమా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, చింతకాయల రాంబాబు, కంచి మాణిక్యం కీర్తి సీతారాం, వేములపూడి అప్పారావు, వాసు, ఏనుగు చిన్నా, దువ్వ శ్రీనువాస్, పాల్గొన్నారు.

మంగవరం-గోపాలపట్నం రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కూటమి నాయకులు

పాయకరావుపేట రూరల్, నవంబరు 2: మండలలోని మంగవరం నుంచి పెద్దిపాలెం వరకు సుమారు 3 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రోడ్డు మరమ్మతు పనులకు శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జనసేన నాయకులు తోట నగేశ్, గెడ్డం బుజ్జి శంకుస్థాపన చేశారు. మంగవరం నుంచి గోపాలపట్నం వరకు రోడ్డు పూర్తిగా పాడవడంతో పలు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాష్ట్ర హోంమంత్రి అనిత మంగవరం, గోపాలపట్నం పెంటకోట తదితర గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు మరమ్మతు పనులకు సుమారు రూ.10 లక్షలు నిధులను మంజూరు చేయించారన్నారు. ఈ నిధులతో మంగవరం నుంచి పెద్దిపాలెం వరకు సుమారు 3 కిలోమీటర్ల రోడ్డు ప్యాచ్ వర్కు చేస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేముల వెంకటేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, చింతకాయల రాంబాబు, వంకా వెంకటరమణ, గణపర్తి రాజుబాబు, చించలపు ప్రదీప్, కె.కొండబాబు, డి. గోవిందు, కట్టా శ్రీను, జి.లక్ష్మీనారాయణ, కె.శివ, దువ్వ శ్రీనువాస్, ఎంపిడిఒ ఎ. జయప్రకాశరావు, ఈఒపిఆర్డీ చంద్రశేఖరరావు, కార్యదర్శి వై.వి. సత్యనారాయణ, ఆర్ అండ్ బీ వర్కు ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్

పాయకరావుపేట రూరల్, అక్టోబరు2 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే జరిగిన గ్రామాలలో నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి అన్నారు. మండలంలోని గుంటపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన రీ సర్వే భూ సమస్యల పరిష్కార గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్వహించిన భూముల రీసర్వే తప్పుల తడకగా ఉండడంతో చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గ్రామ సభలను ఏర్పాటు చేసిందన్నారు. తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ భూముల రీ సర్వేలో భూ విస్తీర్ణంలో గానీ, ఫొటో మిస్ మ్యాచింగ్ వంటి సమస్యలు ఉంటే 15 రోజులలో వాటిని పరిష్కరిస్తామన్నారు. గ్రామ సభలో రైతుల నుంచి 37 అర్జీలను అధికారులు స్వీకరించారు . కార్యక్రమంలో డిసిసిబి మాజీ డైరక్టరు గెడ్డం కన్నబాబు, పల్లెల లచ్చబాబు, పల్లి దుర్గ, రీసర్వే డి.టి రాజేంద్రప్రసాద్, ఆర్.ఐ త్రినాథ్, విఆర్ఒలు రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి

కొయ్యూరు, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని శరభన్నపాలెం లో శనివారం విద్యుదాఘాతంతో కేసంగుర్తి అప్పారావు (అలియాస్‌గోవిందు) (40) మృతి చెందారు. తాను నివాసముంటున్న ఇంటి పక్కన స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రహరీకి ఆనుకుని ఉన్న చెట్టు కొమ్మలు తొలగించే ప్రయత్నంలో విద్యుత్ తీగలు తగలడంతో ఆయన విద్యుదాఘానికి లోనై అక్కడిక్కడే మృత్యువాతపడ్డారు. మృతునిది కాకినాడ సమీపాన గంగనాపల్లి కాగా.. పదేళ్ల కిందట ఉపాధి నిమిత్తం శరభన్నపాలెం వచ్చి ఉం టున్నారు. స్థానిక ఎస్ఐ కిశోర్‌వర్మ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం నిమిత్తం తరలించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

కోటవురట్ల, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏవో బి. సరోజిని అధ్యక్షతన సమాచార హక్కు చట్టం-2005 అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అధి కారులంతా పౌరులు అడిగిన సమాచారాన్ని 30 రోజుల్లో అందించాలని అన్నారు. సెక్షన్ 4(1) ప్రకారం అన్ని రికార్డులు రిజిష్టర్లు నిర్వహించాలన్నారు. ఈ సదస్సులో ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఈవోపీఆర్‌డి రఘురాం, మాట్లాడారు. హార్టికల్చర్ సహాయకులు, ఉపాధిఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సమస్యలపై ఏపీటీఎఫ్ చర్చ

ఎస్.రాయవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాపురంలో శనివారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ బలపరిచిన పాకలపాటి రఘువర్మ గెలుపునకు సంబంధించిన వ్యూహంపై చర్చించారు. జీవో 117 రద్దుతో పాటు ప్రస్తుతం అమలవుతున్న సీబీఎస్‌ఈ సిలబస్‌తో కూడిన అస్తవ్యస్తమైన విద్యా విధానాన్ని రద్దుపరిచి పాత పద్ధతిలో స్టేట్ సిలబస్‌ను పునరుద్ధరించాలన్నారు. తెలుగు మీడియంకు సమాంతరంగా ఇంగ్లీష్ మీడియం నడపడం, వాటికి అనుగుణంగా సబ్జెక్టు టాచర్ పోస్టుల మంజూరు, హైస్కూళ్లలో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను మరలా వెనక్కి పంపడం, యూపీ స్కూల్స్‌కి పోస్టులు మంజూరు తదితరాలపై చర్చించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు సునీల్, కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పారిశుధ్యంతో వ్యాధులు దూరం

కోటవురట్ల, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): బీకేపల్లి గ్రామ పంచాయతీలో శనివారం ఎంపీడీవో కాశీవిశ్వనాథం ఆధ్వర్యంలో తడిపొడి సంపదకేంద్రాన్ని శానిటేషన్ డ్రై కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా బీకేపల్లి సంపద కేంద్రం దగ్గరలో పేరుకు పోయి ఉన్న చెత్తాచెదారాలను శ్రమదానంగా తొలగించారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెట్ల లింగంనాయుడు, పంచాయతీకార్యదర్శి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసం పూజలు ప్రారంభం



ఉపమాక శివాలయంలో శివలింగం

నక్కపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉపమాక, గొడిచెర్ల శివాలయాల్లో శనివారం ఉదయం నుంచి కార్తీకమాసం నెల రోజుల పూజలు ప్రారంభమయ్యాయి. ఉపమాక పురాతన శివాలయంలో తెల్లవారుజామున ఆలయ అర్చకులు మహేశ్, సంతోశ్‌లు శివుడికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం సప్తహారతులిచ్చారు. ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. గొడిచెర్ల శేషలింగేశ్వరస్వామి ఆలయాన్ని కూడా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

అడ్డరోడ్డు-నర్సీపట్నం రోడ్డు మరమ్మతు చేయాలి

▸ సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అప్పలరాజు



పెదగుమ్ములూరు రోడ్డుపై సీపీఎం నేతలు, వాహన చోదకుల నిరసన

ఎస్.రాయవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అడ్డరోడ్డు-నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. దీనిపై శనివారం పెద గుమ్ములూరు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వాహనదారులతో కలిసి నిరసన తెలి పారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ఈ రోడ్డు గోతులతో ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఈ మార్గంలో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో అడ్డరోడ్డు నుంచి నర్సీపట్నం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డును దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.సత్యనారాయణ, దుర్గాప్రసాద్, సిహెచ్.అప్పారావు, బి.నరేంద్ర, జి.రమణ పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారణ భక్తులకు అన్నసమారాధన

ఎస్.రాయవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని అయ్యప్ప మాలధారణ భక్తులకు ఎస్.రాయవరం శివాలయంలో శనివారం దాతల సాయంతో అన్నసమారాధన (భిక్ష) ప్రారంభించారు. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు గ్రామానికి చెందిన నమ్మి కనకలక్ష్మి స్వాముల భిక్షను ఏర్పాటు చేశారు. మాల ధరించిన స్వాములు, భవానీలకు 41 రోజుల పాటు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అయ్యప్ప సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గురు స్వాములు ఎడ్ల వరహాలరావు, నమ్మి శ్రీను, పులి సత్తిబాబు, సురేశ్, శేఖర్, సతీశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పాయకరావుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో ఆదివారం ఉదయం ఆరు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఆపరేషన్ డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పాయకరావుపేటలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో 11 కేవీ తాండవ షుగర్స్ ఫ్యాక్టరీ ఫీడర్ పరిధిలో చెట్టు కొమ్మలు తొలగింపులో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలో ధనిశెట్టినగర్, షీలానగర్, పండరీపురం, ఇందిరా కాలనీ, లింగాల కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, దుర్గా కాలనీ, అంబేద్కర్ కాలనీ, శబరి కాలనీ, రాజీవ్ కాలనీ, మండలంలోని పీఎల్.పురం జగనన్న కాలనీ 1, 2 పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సమస్యలపై చంద్రబాబుకు వినతుల వెల్లువ

▸▸ తాడి గ్రామాన్ని తరలించాలని.., ఫార్మాసిటీ, ఎన్టీపీసీల్లో 75 శాతం నిర్వాసితులకే ఉపాధి కల్పించాలని నాయకులు విజ్ఞప్తి





చంద్రబాబుకు వినతిని అందిస్తున్న పీఆర్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాలు, మాజీ ఎంపీపీ నీలబాబు

పరవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్నెలపాలెం విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సమస్యలపై పలువురు వినతి పత్రాలు అందజేశారు ముఖ్యంగా ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తరలించాలని మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావులు విజ్ఞప్తి చేశారు. ఫార్మా కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దీనివల్ల తరుచూ అనారోగ్యాలకు గురవుతున్నామని వాపోయారు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీల్లో 75 శాతం నిర్వాసితులకే ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. అచ్యుతాపురం సెజ్‌లో ఇటీవల మూతపడిన అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారాన్ని తెరిపించాలని పలువురు కార్మికులు విన్నవించారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో జరిగిన ప్రభుత్వ భూముల కుంభకోణాలపై చర్యలు చేపట్టాలని ఆర్‌టీఐ కార్యకర్త చిప్పాడ రామారావు ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. అన్యా క్రాంతమైన భూములను వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. మరికొంత మంది సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. అలాగే, సింహాద్రి ఎన్టీపీసీ, ఫార్మాసిటీ పరిశ్రమల్లో ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధి మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ నుంచి విడుదలవుతున్న వ్యర్థ రసాయనాలు నేరుగా సముద్రంలోకి విడిచిపెట్టడంతో మత్స్య సంపద నశించిపోతుందని, దీని వల్ల మత్స్యకారుల జీవనం అగమ్యగోచరంగా తయారైందని పేర్కొన్నారు. రాంకీ యాజమాన్యం ఫార్మా వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా పైపులైన్ల ద్వారా వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెట్టడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైందన్నారు.

దీనిపై తాము గతంలో ఫార్మాసిటీ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టగా 500 మందికి ఉపాధి కల్పిస్తామని లిఖితపూర్వకంగా రాంకీ యాజమాన్యం హామీ ఇచ్చిందని తెలిపారు. అయితే ఇప్పటికీ ఉపాధి కల్పించలేదని, దీని వల్ల మత్స్యకారులు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. తక్షణమే స్పందించాల్సిందిగా కోరారు.

సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు

రహదార్ల మరమ్మతు పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కొణతాల



రోడ్ల మరమ్మతుకు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల, పీలా

తుమ్మపాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతున్నట్లు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. అనకాపల్లి మండలం మార్టూరు జంక్షన్ వద్ద శనివారం రోడ్ల మరమ్మతుల కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లను సిద్ధం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం రోడ్లు, భవనాల శాఖను నిర్లక్ష్యం చేసిందని దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రహదారులు అధ్వానంగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆర్‌అండ్‌బీ శాఖకు నిధులు మంజూరు చేసిందన్నారు. తద్వారా రహదారులకు మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు అసౌకర్యాలు కలగకుండా చూస్తామన్నారు. నియోజకవర్గంలో రూ.73 లక్షలతో పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. అనకాపల్లి- చోడవరం రోడ్డు మరమ్మతులకు రూ. పది లక్షలు, రేబాక - కొండకొప్పాక రోడ్డుకు రూ. పది లక్షలు, అనకాపల్లి - తోటాడ రోడ్డుకు రూ. తొమ్మిది లక్షలు, తుమ్మపాల- వెంకుపాలెం రోడ్డుకు రూ. పది లక్షలు, మామిడిపాలెం- కొండుపాలెం రోడ్డుకు రూ. తొమ్మిది లక్షలు, తుమ్మపాల గుండాల జంక్షన్ నుంచి లక్ష్మీదేవిపేట రోడ్డుకు రూ. ఐదు లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. తక్షణమే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఉమ్మడి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'సమాజంలో ఫార్మాసిస్టుల పాత్ర అత్యంత కీలకం'



వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న రత్నాకర్

కొత్తూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం సందర్భంగా స్థానిక బీఆర్‌టీ కాలనీలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఫార్మాసిస్ట్ కార్పొరేషన్, మెడికల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ప్రారంభించారు. సమాజంలో ఫార్మాసిస్టుల పాత్ర అత్యంత కీలకమన్నారు. కరోనా వంటి కష్టకాలంలో ప్రాణాలను లెక్కచేయకుండా దేశంలోని ప్రతి మెడికల్ షాపు, ఫార్మాసిస్టు సేవలందించారని కితాబునిచ్చారు. టీడీపీ నాయకుడు మళ్ల సురేంద్ర, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఫార్మాసిస్టు కార్పొరేషన్ ప్రతినిధులు రత్నాల ప్రభాకరరావు, రత్నాల ప్రకాశరావు, గిరిజ, నాయకులు మళ్ల శ్రీను, యల్లపు వెంకట్రావు, కాండ్రేగుల రాజు, ఆడారి శ్రీను, మద్దాల నాగఅప్పారావు, పొలమరశెట్టి నూకరాజు, పెంటకోట శ్రీను, పీలా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలతో భూ సమస్యలకు పరిష్కారం



అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ గణేశ్

సబ్బవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.గణేశ్ సూచించారు. మండలంలోని బోదివలసలో శనివారం జరిగిన గ్రామ సభలో మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి ఇదో చక్కని వేదికగా పేర్కొన్నారు. అనంతరం పలువురి నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు గంతకోరు సూర్యనారాయణ, కోన సంజీవరావు, కంచిపాటి రాంబాబు, సర్వేయర్లు ఎల్.అప్పారావు, శ్యామ్, రాంబాబు, వీఆర్‌వోలు ఎం.గోవిందరావు, కామరాజు, దొగ్గ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

కశింకోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాలివి. హైదరాబాద్ మియాపూర్ ప్రాంతానికి చెందిన వేమలమండ శ్రీనివాసరాజు(60) నెల రోజుల క్రితం భీమవరంలో ఉన్న తమ బంధువుల ఇంటికి వచ్చారు. నర్సింగబిల్లి గ్రామ సమీపంలో ఉన్న యలమంచిలి నుంచి అనకాపల్లికి వెళ్లే ఎన్‌హెచ్-16 జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. స్థానిక వీఆర్వో పృథ్వీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా శ్రీనివాసరాజు ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చాడనే విషయం తెలియరాలేదు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచారు.

రిటైర్డు ఎంఈవో సూర్యనారాయణమూర్తికి సన్మానం



సూర్యనారాయణమూర్తిను సత్కరిస్తున్న గాదె

సబ్బవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడ ఎంఈవో-2గా పనిచేసిన బోలెం సూర్యనారాయణ మూర్తి చక్కని సేవలందించారని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. పదవీ విరమణ పొందిన ఆయనకు ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటైన సన్మాన సభలో మాట్లాడారు. ఎందరో విద్యార్థులను సూర్యనారాయణమూర్తి ఉత్తములుగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంఈవో-1 ఎస్.లక్ష్మణరావు, ఏవో శివరామ్‌ప్రసాద్, బోకం రామునాయుడు, లెక్కల హేమంత్‌సుదేవ్‌లతో పాటు పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన 'దాడి'





బాబుతో వీరభద్రరావు,రత్నాకర్

అనకాపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా పరవాడ పర్యటనకు శనివారం విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. హెలిప్యాడ్ వద్ద ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు.

బందోబస్తు నిర్వహణ భేష్

▸▸ అర్ధరాత్రి దాటాక ఆదేశించినా ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం

▸▸ పరవాడ సబ్ డివిజనల్ అధికారులకు విశాఖ రేంజ్ డీఐజీ అభినందనలు



బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులతో డీఐజీ గోపీనాథ్ జెట్టి

పరవాడ /అనకాపల్లి రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా బందోబస్తు విధులను దిగ్విజయంగా నిర్వహించిన పరవాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారులను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి శనివారం అభినందించారు. తొలుత సీఎం పర్యటన విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేసినప్పటికీ అనివార్య కారణాల వల్ల శుక్రవారం అర్ధరాత్రి పరవాడ మండలం వెన్నెలపాలెంలో రహదారి మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టేందుకు నిర్ణయించారన్నారు. దీంతో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనకు అప్పటికప్పుడు ఏర్పాట్లు చేశామన్నారు. అర్ధరాత్రి దాటాక సీఎం బందోబస్తు ఏర్పాట్లను చేయాలని పరవాడ సబ్ డివిజనల్ అధికారులకు ఆదేశించడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేసి సీఎం పర్యటనను విజయవంతం చేశారన్నారు. ప్రజలకు ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చేశారని, ఏ ఇతర రాజకీయ పార్టీల నాయకులకు ముందస్తుగా ఎటువంటి గృహ నిర్బంధాలు కానీ, అరెస్టులు కానీ చేయలేదని డీఐజీ వివరించారు.

వరి పంటలో పొటాష్ లోపం

▸▸ నివారణకు ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అనేక ప్రాంతాల్లో వరి పంటలో పొటాష్ లోపం అధికంగా ఉందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. శనివారం ఇక్కడి వ్యవసాయ పరిశోధనా స్థానంలో జరిగిన జిల్లా వ్యవసాయ సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పొటాష్‌ను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో వేయవలసి ఉన్నప్పటికీ ధర ఎక్కువగా ఉందనే కారణంతో రైతులు దీని వాడకం తగ్గించి వేస్తున్నారని వివరించారు. సమగ్ర ఎరువుల యాజమాన్యం ద్వారా పొటాష్, భాస్వరం, జింకు లోపాలను నివారించాలని ఆయన రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ ప్రతినిధులు శ్రీధర్, సుబ్రమణ్యం, వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పార్శిల్ బుకింగ్ కౌంటర్ కొనసాగించాలి

రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కు రత్నాకర్ వినతి

అనకాపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రైల్వే స్టేషన్‌లో ఎత్తివేసిన పార్శిల్ బుకింగ్ కౌంటర్‌ను యథావిధిగా కొనసాగించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ సచ్చినివాస్‌ను కోరారు. ఈ మేరకు శనివారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి పార్శిల్ బుకింగ్ కార్యాలయాన్ని తాత్కాలికంగా అధికారులు మూసివేశారన్నారు. దక్షిణ మధ్య రైల్వే డివిజన్‌లో అతి పెద్ద రైల్వేస్టేషన్ అనకాపల్లి అని, అందులోనూ డివిజన్‌లో చివర ఉందన్నారు. అనకాపల్లి, అచ్యుతాపురం, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, పాడేరు, అరకు నియోజక వర్గాల ప్రజలు ఈ స్టేషన్ నుంచే ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తుంటారన్నారు. జిల్లాలో పెద్ద ఫార్మా కంపెనీలు, వస్త్ర పరిశ్రమలు తదితరాలు ఉన్నట్టు చెప్పారు. వాటి నుంచి సరకులు ఎగుమతి, దిగుమతి ఈ స్టేషన్ ద్వారానే దూర ప్రాంతాలకు సాగిస్తుంటారన్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న పార్శిల్ బుకింగ్ కౌంటర్‌ను మూసి వేయడం తగదన్నారు. ఈ సమస్యను అనకాపల్లి ఎంపీ, సీఎం రమేష్ దృష్టికి తీసుకు వెళ్లగా, ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్య పరిష్కారిస్తానని తెలిపారన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ తదితరులు

సబ్బవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి సైన్స్, క్రాఫ్ట్ ప్రదర్శనలో ఇక్కడి గురుకుల పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి అధికారుల ప్రశంసలు అందుకున్నారు. విశాఖలోని మధురవాడలో జోనల్ స్థాయిలో జరిగిన పోటీల్లో సబ్బవరం విద్యార్థులు అశోక్, విశ్వనాథ్, శివహేమంత్, నవదీప్, మున్న హాజరై సైన్స్ ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ విభాగాల్లో అద్భుతంగా రాణించారన్నారు. దీంతో వీరికి జిల్లా కలెక్టర్, డీఈవో, డీసీవో ప్రశంసించారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ తెలిపారు. అలాగే, ఈనెల 18న ఆర్‌కే పురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరిగే సైన్స్ ప్రాజెక్టుల్లో వర్టికల్ ఫార్మింగ్ మెషీన్, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ప్రాజెక్టులతో సదరు విద్యార్థులు హాజరు కానున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యారావు, ఉపాధ్యాయులు మోహనరావు, జానకీరామ్, సింహాచలం, చిరంజీవిరావు, ప్రభాకరరావు, తిరుపతిరావు, పీడీ ప్రసాద్, పీఈటీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛను అందజేత



నూకరాజుపింఛన్ నగదు అందిస్తున్న

కశింకోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం పంచాయతీ బంగారయ్యపేటకు చెందిన అమ్మిశెట్టి నూకరాజు రెండు రోజుల క్రితం గుండెపోటుతో కేజీహెచ్ చేరి చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ప్రతి నెలా ప్రభుత్వం అందిస్తున్న పింఛనును తాళ్లపాలెం సచివాలయం-2 డిజిటల్ అసిస్టెంట్ కె.హరిణి శనివారం నేరుగా కేజీహెచ్‌కు వెళ్లి రూ.నాలుగు వేల నగదును అతనికి అందజేశారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు నూకరాజు అభినందనలు తెలిపారు.

ఆలయాల్లో కార్తీక పూజలు ప్రారంభం



ఆలయంలో స్వామికి పూజలు

అనకాపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పూజలు పట్టణంలోని శివాలయాల్లో శనివారం ప్రారంభమయ్యాయి. కాశీవిశ్వేశ్వర, సిద్ధిలింగేశ్వర, భోగలింగేశ్వర, ఉమా రామలింగేశ్వర తదితర ఆలయాలను అర్చకులు వేకువజాము నాలుగు గంటలకే తెరిచి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ధ్వజస్తంభాల వద్ద మహిళలు దీపారాధన జరిపారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు 'గ్లోబల్' విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పరవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల అరకులో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. దీంతో వి.ఆద్య, పి.అరియాణా, ఎ.చారుహాసినీ, కె.సాయి మనస్వి, బి.వైష్ణవి, పి.రాథోడ్, ఎల్.తేజేశ్వరరావు, పి.సాహిత్ కృష్ణంరాజు, వి.సాకేత్‌రామ్‌లు పార్వతీపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, పాఠశాల సీఈవో కె.నిశాంత్ అభినందించారు.

వ్యాసరచనలో ఇంటర్ విద్యార్థులకు బహుమతులు

పరవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా పవర్‌గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు 'దేశ శ్రేయస్సు కోసం సంస్కృతి సమగ్రత' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కె.మహాలక్ష్మి, ఎస్‌పీ ప్రజ్ఞ, జి.రాజు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరందరికీ పవర్‌గ్రిడ్ సంస్థ చీఫ్ మేనేజర్ రాజా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పవర్‌గ్రిడ్ సంస్థ ఉద్యోగులు అమర్‌దీప్, పైలా అప్పారావు, కళాశాల లెక్చరర్లు లలితకుమారి, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

అనకాపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. పతంజలి యోగా చికిత్స హరిద్వార యోగా పీఠం నుంచి స్వామి రిత్విదేవ్ మహరాజ్ విచ్చేసి ఈ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షుగర్ వ్యాధిని యోగా చికిత్స ద్వారా తరిమి వేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు దొరమ్మనాయుడు, జార్జిక్లబ్ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బంగ్లా కూడలిలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి



యోగాసనాలు వేస్తున్న దృశ్యం

పరవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి బంగ్లా కూడలిలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే అక్కడ బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే బంగ్లా కూడలిలో బస్ షెల్టర్ లేక బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు ఫార్మాసిటీ, ఎన్టీపీసీ విధులకు వెళ్లే కార్మికులంతా ఈ కూడలి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. బస్ షెల్టర్ లేకపోవడం వల్ల వర్షాకాలం, ఎండకాలంలో అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయన్నారు. అధికారులు తక్షణమే స్పందించి బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరారు.

'పేదలకు పూర్తిస్థాయిలో ఉచిత వైద్యం అందించాలి'

అనకాపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యశ్రీ పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తూ.. పథకానికి మంగళం పాడాలని చూస్తుందని సీపీఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల ముందు పేదలకు పూర్తిస్థాయిలో ఉచిత వైద్యం అందిస్తామని వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం, రూ.25 లక్షలను రూ.ఐదు లక్షలకు కుదిస్తే రోగులు అప్పుల బారిన పడి తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇంత వరకు ఆరోగ్యశ్రీ కింద 3,255 వ్యాధులకు చికిత్సలు అందిస్తుండగా, ఇప్పుడు 1900 వ్యాధులకు మాత్రమే కుదించాలని చూడడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఆగస్టు నెల నుంచి నిలిపివేసిన రోగుల ఆసరా సొమ్మును వెంటనే విడుదల చేయాలని, గతంలో మాదిరిగా ఎన్టీఆర్ వైద్యసేవ కింద రూ.25 లక్షలు వరకు వైద్యఖర్చులకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

'పదిహేను రోజుల్లోగా సమస్యలు పరిష్కారం'

పరవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకువస్తే 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎస్‌వీ అంబేద్కర్ వెల్లడించారు. ఈ.బోనంగి పంచాయతీపరిధి బొద్దపువానిపాలెంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామాల వారీగా రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు వివిధ సమస్యల పై అర్జీలను అందజేశారు. మొత్తం 124 అర్జీలు అందినట్లు ఆర్ఐ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీకాంత్, రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత

▸▸ స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో వక్తలు

సబ్బవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అన్నారు. మొగలిపురంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పరిశుభ్రతపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కలగాలన్నారు. రోగాలు ప్రబలకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం సపంద కేంద్రంలో వానపాములను విడిచిపెట్టారు. ఈ కార్యక్రంలో సర్పంచ్ గండి అరుణ, ఈవోపీఆర్‌డీ బిచైతన్య, తమరాన బంగారునాయుడు, అంగటి నానాజీ, సత్యనారాయణ, రాంబాబు, నరేష్, కిశోర్, రాము, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : పరవాడపాలెంలో శనివారం స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఉన్న చెత్తను, సంపద కేంద్రం ఆవరణలో పేరుకుపోయిన మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్రీనివాసరావు, సర్పంచ్ బలిజ మంగ, ఉప సర్పంచ్ గొంతిన ఈశ్వరరావు, బలిజ మునిలినాయుడు, పరవాడ చినరమణ, సరిపిరెడ్డి దాసు తదితరులు పాల్గొన్నారు.



పరవాడపాలెం సంపద కేంద్రం ఆవరణలో మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

'పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట'



పాడి పశువులకు సంబంధించిన మందులను అందజేస్తున్న గండి బాబ్జీ

సబ్బవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పాడి సంపదను సంరక్షించేందుకు రైతులకు అవసరమైన సూచనలు, సలహాలను పశు వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అందించాలని టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ కోరారు. మండలంలోని మొగలిపురంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటైన ఉచిత పశు గర్భకోశ చికిత్సా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ రంగమైన పాడి పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే వివిధ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల పశు సంవర్ధక శాఖాధికారి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ పశు వైద్య సిబ్బంది ఇచ్చిన సూచనలను పాడి రైతులు పాటించి, తద్వారా పశు సంపదను వృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం పాడి పశువులకు సంబంధించిన మందులను ఆయా రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ బి.ప్రసాదరావు, ఉప సంచాలకులు డాక్టర్ ఎం.చంద్రశేఖర్, డాక్టర్ కె.ఉషాకుమారి, డాక్టర్ సంధ్య, డాక్టర్ పి.భానుబాబు, డీఎల్‌డీ ఎస్.సౌజన్య, ఎస్.స్వర్ణలత, జి.అరుణ, ఎంపీటీసీ తమరాన బంగారునాయుడు, అంగటి నానాజీ, సత్యనారాయణ, బండయ్య, తాతబాబు, సత్తిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఆర్. కొత్తూరులో సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ప్రసాద్



ఉచిత గ్యాస్ సిలిండర్ లబ్ధిదారునికి అందజేస్తున్న కూటమి నాయకులు

అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు

కూటమి నాయకులు

చింతపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం అందజేయనున్నట్టు టీడీపీ మండల సీనియర్ నేత రీమల ఆనందరావు అన్నారు. శనివారం జీసీసీ గోదాములు గ్యాస్ ఇన్‌చార్జి ఎల్. రమణమూర్తితో కలిసి టీడీపీ నాయకులు ఉచిత గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారునికి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో టీడీపీనాయకులు పెదిరెడ్ల బేతాళుడు, లక్కోజు నాగభూషణం, జనసేన నేత గాజుల శ్రీను పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే పభుత్వ లక్ష్యం

కొయ్యూరు: ప్రతీ పల్లెను అభివృద్ధి పథంలో నడిపించటమే ప్రభుత్వ లక్ష్యమని జీసీసీ మాజీ ఛైర్మన్ ఎంవీవీ ప్రసాద్ అన్నారు. మండలంలోని రొంగలి కొత్తూరు గ్రామంలో రూ. 4 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గల 33 పంచాయతీలకు రూ. కోట్లాది రూపాయలతో వసతులు కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీరామూర్తి, నేతలు చిరంజీవి, గోవిందు, సర్పంచ్‌తోపాటు మహిళలు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు: ఎంపీపీ

చింతపల్లి: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. శనివారం రూ. 8లక్షల మండల పరిషత్ నిధులతో కిటుముల పంచాయతీ రాచపనుకు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆమె భూమిపూజ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో ప్రధానంగా గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు, రక్షిత మంచి నీటి పథకాలను నిర్మిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో పీఆర్ జేఈఈ బాలకిశోర్, వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు, సర్పంచ్ రమణమ్మ, ఎంపీటీసీ సభ్యులు పద్మ, మోహనరావు, లోవరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అంగదరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మంచంపట్టిన కాశీపట్నం

» గ్రామంలో విష జ్వరాలు » అందని వైద్య సేవలు

అనంతగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విషజ్వరాలు రోజురోజుకు విజృంభిస్తుండడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.. మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో ఇంటి ఒకరు మంచాన పడుతున్నారు. జ్వరాలతో బాధపడుతున్నా వైద్యసేవలను అందకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలో ఆర్. రాజేశ్వరి, జే లక్ష్మి, ఎల్. చంద్రమ్మ, ఆర్. యామిని, పీ సింహాచలం, ఆర్. స్రవంతి, ఆర్.సంతోష్, బి.లక్ష్మి, చిన్నలమ్మ తదితరులు విషజ్వరాలతో బాధపడుతున్నారు.గ్రామంలో వైద్యసేవలు అందకపోవడంతో పలువురు ఎస్.కోట ప్రైవేటు ఆస్పత్రులకు పరుగుతీయాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి, వైద్య శిబిరం ఏర్పాటు చేసి, వైద్య సేవలందించాలని పలువురు గిరిజనులు కోరుతున్నారు.





జ్వరంతో బాధపడుతున్న గిరిజనులు

జ్వరంతో చిన్నారి మృతిపై వివరణ కోరిన డీఎంహెచ్‌వో

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

అనంతగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రా పంచాయతీ గేటువలస గ్రామానికి చెందిన సోని, పుష్ప దంపతుల నాలుగు నెలల చిన్నారి జ్వరంతో మృతిచెందడంపై డీఎంహెచ్‌వో జమాల్‌బాషా స్పందించారు. శనివారం 'దీపావళి రోజున విషాదం' పేరిట చిన్నారి మృతిపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. చిన్నారి మృతిగల కారణాలపై వివరణ ఇవ్వాలని, అనంతగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి జ్ఞానేశ్వరిని ఆదేశించారు. ఆమె గతనెల 28వ తేదీన గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరంలో చిన్నారి వైద్య పరీక్షలు నిర్వహించి దగ్గు, జలుబుమందులు అందించినట్టు తెలిపారు. అదేరోజు చిన్నారి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులను గుర్తించిన కుటుంబ సభ్యులు పీహెచ్‌సీ తీసువచ్చారన్నారు. అవరమైన చికిత్సనందించి, అనంతరం అరకు ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ మృతి చెందినట్టు వైద్యాధికారి జ్ఞానేశ్వరి తెలిపారు.

సారా వ్యాపారులు అరెస్టు

హుకుంపేట నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేర్వేరు చోట్ల సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ సురేశ్ తెలిపారు. హుకుంపేట మండలం గూడ పంచాయతీ గొచ్చరి గ్రామానికి పాంగి రామకృష్ణ, డుంబ్రిగూడ మండలం రంసింపాడు గ్రామానికి చెందిన వలస నైని సింహాచలంపై ముందస్తు సమాచారం మేరకు దాడి చేశామన్నారు. 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండ్ తరలించామని పేర్కొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు...

హుకుంపేట పంచాయతీ దాలిగుమాడి గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురుని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ సురేశ్ తెలిపారు.వారి నుంచి రూ. 12, 860 స్వాధీనం చేసుకున్నామన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



రాధాకృష్ణరాజు (ఫైల్)

హుకుంపేట నవంబరు 2 (ఆంధ్రజోతి) : మండలంలోని బాకూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బాకూరు రాధాకృష్ణ రాజు (47) అనారోగ్య సమస్యలతో శనివారం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. రాధాకృష్ణరాజు ఎస్. రాయవరం ప్రభుత్వ పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధాన ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. హుకుంపేట మండలంలోనూ చాలా ఏళ్లపాటు ఆయన పనిచేశారు. పీఆర్‌టీయూ నాయకుడిగా వ్యవహరించారు. ఆయన మృతిపై స్థానిక ఎంఈవోలు చెల్లయ్య, ఈశ్వరరావు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తంచేశారు.

మాజీ సర్పంచ్ మృతి

ముంచంగిపుట్టు: మండలంలోని దారెల పంచాయతీ చివుకుచింత గ్రామానికి చెందిన మాజీ సర్పంచు ఎం.పెంటయ్య(70) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ప్రస్తుత పంచాయతీ సర్పంచ్ పి.పాండురంగ స్వామి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పలుపార్టీలు, సంఘాల నాయకులు, ప్రజలు పెంటయ్యకు ఘన నివాళులర్పించారు.

బోస్తురి పిక్కలు , అలసందలకు గిరాకీ



హుకుంపేట సంతలో విక్రయానికి తీసుకువచ్చిన ఉత్పత్తులు

హుకుంపేట నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) ; గిరిజనులు పండించిన బోస్తురి పిక్కలు, అలసందలకు స్థానిక శనివారం వారపు సతంలో గిట్టుబాటు ధర లభించింది. బోస్తురి పిక్కలు కిలో రూ. 200నుంచి రూ. 220 వరకు పలికింది. అలసందులు కిలో రూ.150 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ సీజన్ ప్రారంభం కావడంతో వ్యాపారులు ఈ పంటలను పోటీ పడి కొనుగోలు చేశారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి



మృతుడు అప్పారావు

కొయ్యూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభన్నపాలెంలో శనివారం విద్యుదాఘాతంతో కేసంగుర్తి అప్పారావు (అలియాస్‌గోవిందు) (40) మృతి చెందారు. తాను నివాసముంటున్న ఇంటి పక్కన స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రహరీకి ఆనుకుని ఉన్న చెట్టు కొమ్మలు తొలగించే ప్రయత్నంలో విద్యుత్ తీగలు తగలడంతో ఆయన విద్యుదాఘానికి లోనై అక్కడిక్కడే మృత్యువాతపడ్డారు. మృతునిది కాకినాడ సమీపాన గంగనాపల్లి కాగా.. పదేళ్ల కిందట ఉపాధి నిమిత్తం శరభన్నపాలెం వచ్చి ఉంటున్నారు. స్థానిక ఎస్ఐ కిశోర్‌వర్మ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం నిమిత్తం తరలించారు.

ఆర్వీనగర్-పాలగెడ్డ అంతర్రాష్ట్ర రహదారిని బాగు చేయాలి

» అఖిల పక్షం నాయకుల ఆధ్వర్యంలో నిరసన



వలసగెడ్డ వద్ద రోడ్డుపై నిరసన తెలుపుతున్న నాయకులు

సీలేరు, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి) : ఆర్వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు గల అంతర్రాష్ట్ర రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ శనివారం దుప్పులవాడ పంచాయతీ వలసగెడ్డ వద్ద అఖిల పక్షం నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పాడేరు డివిజన్ పరిధిలోని గల ఈ 78 కిలోమీటర్ల రహదారి గత 12 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురై, గోతులతో చెరువులను తలపిస్తోందన్నారు. ప్రయాణికులు, అత్యవసర సమయంలో బాలింతలు, గర్భిణులు, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించడానికి ఈ సీజన్‌లో అధికంగా వచ్చే పర్యాటకులు ఈ రహదారిలో తీవ్ర ఇబ్బందికి లోనవుతున్నారని చెప్పారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈమార్గం మరింత అధ్వాన్నవంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. అఖిల పక్షం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు వినతి పత్రాలు పంపించనున్నట్టు ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో (2018)లో ఈ అంతర్రాష్ట్ర రహదారిని రూ. 84 కోట్లతో డబుల్ లైన్‌గా మార్చడానికి నిధులు మంజూరు చేశారన్నారు. అయితే, అటవీ అనుమతులు జాప్యంతో కార్యరూపం దాల్చలేదు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రహదారికి మంజూరైన రూ. 84 కోట్లను వేరే దానికి మళ్లించినట్టు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఈ రహదారికి మోక్షం కలిగించి ఈ ప్రాంతీయుల రహదారి కష్టాలను తీర్చాలని ఈ సందర్భంగా అఖిల పక్షం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సీలేరుకు చెందిన టీడీపీ నాయకుడు నక్కా జ్ఞానేశ్వరరావు, సీలేరు సర్పంచ్ పాంగి దుర్గో, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వానపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి: ఎమ్మెల్యే



శివలింగపురం పాఠశాలలో వంటలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని శివలింగపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, మెనూపై ఆరా తీశారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను అడిగితెలుసుకుని, పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం డీకే పర్తిలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీటీసీ సభ్యులు మితుల, వైసీపీ నాయకులు స్వామి, సూర్యనారాయణ, అశోక్, అప్పారావు, గంగన్నదొర, డానియేలు, భీమ్మలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ రవీంద్ర సేవలు ఆదర్శనీయం



బదిలీ ఎస్ఐ రవీంద్రని సన్మానిస్తున్న నాయకులు

ముంచంగిపుట్టు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్తున్న స్థానిక ఎస్ఐ కె.రవీంద్ర సేవలు ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు.గత రెండేళ్లుగా ఇక్కడ పని చేసిన రవీంద్ర సీలేరు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శనివారం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన వీడ్కోలు సభ నిర్వహించారు. కూటమి నేతలు, వైసీపీ నేతలు, వర్తకులు, పోలీసులు ఎస్ఐను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అందరి సహకారంతో సమర్థంగా విధులు నిర్వహించినట్టు అన్నారు. సర్పంచులు వి.లక్ష్మణ్, నీలకంఠం, రమేష్, గంగాధర్, నాయకులు కె.బలరాం, వి.రామస్వామి, చిన్నిబాబు, జగత్‌రాయ్ పాల్గొన్నారు.

పాడేరు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా బుల్లిబాబు



పాడేరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాడేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా సతకా బుల్లిబాబును పీసీసీ అధ్యక్షురాలు వైఎస్. షర్మిల శనివారం ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 అసెంబ్లీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తలను నియమించింది. అందులో భాగంగా ప్రస్తుతం అల్లూరి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న బుల్లిబాబునే స్థానిక అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తగా నియమించారు. ఈ నియామకంపై పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

ఇంకుడుగుంతల నిర్మాణానికి నిధులు

» డ్వామా పీడీ శివయ్య



ప్రజావేదికలో పీడీ శివయ్య, డీఆర్‌పీలు, ఇతర అధికారులు

కొయ్యూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో ప్రతీ జాబ్‌కార్డుదారుడు వారి ఇళ్ల వద్ద ఇంకుడుగుంతలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ. 6 వేల చొప్పున నిధులు విడుదల చేసినట్టు డ్వామా పీడీ ఎం. శివయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధి పథకంలో ప్రతీ లబ్ధిదారుడికి 100 రోజులు పని కల్పించేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. రైతులు పశు సంరక్షణకు వీలుగా పథకంలో క్యాటిల్‌షెడ్ నిర్మాణాలు సహకరిస్తామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లాలో 613 షెడ్‌లు మంజూరు చేసినట్టు వివరించారు. రైతుల ఆర్థికాభివృద్ధికి ఈ పథకంలో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ మేరకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 10,803 ఎకరాల్లోఆసక్తి గల రైతులకు మొక్కలతో పాటు వాచ్ అండ్ వార్డు ఇస్తున్నట్టు వివరించారు. పథకం ప్రారంభంలో నియమించిన వీఆర్‌పీలకు, అనంతరం నియామకాలు జరిపిన వీఆర్‌పీలకు వేతనాలలో తేడా ఉందని, అందరికీ సమాన వేతనం కోసం ఎస్‌పీడీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పథకం ద్వారా ఖర్చు చేసిన రూ 47.73 కోట్లకు సంబంధించి గత నెల 8 నుంచి 31వ తేదీ వరకు 33 పంచాయతీలలో నిర్వహించిన 16వ విడత సోషల్ ఆడిట్‌కు సంబంధించిన వివరాలు డీపీఆర్‌లు వెల్లడించారు. పథకం జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలా దేవి, ఏపీవో వై. వెంకటరావు, ఎస్‌ఆర్‌పీ రాజు, ఎంపీడీవో ఎస్‌కేవీ ప్రసాద్, ఎంపీపీ రమేష్ బాబు, ఎంపీటీసీ సభ్యులు బిడజాన అప్పారావు, 33 పంచాయతీల వీఆర్‌పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, వేతనదారులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు, వంతెనలు నిర్మించాలని వినతి

గూడెంకొత్తవీధి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివారునున్న అమ్మవారి ధారకొండ, గాలికొండ పంచాయతీ పరిధిలో గ్రామాలకు రోడ్లు, వంతెన నిర్మించాలని కోరుతూ గిరిజన సంక్షేమశాఖ డీఈ జి. రఘునాథరావునాయుడుకు తెలుగు యువత మండల అధ్యక్షుడు ముర్ల కోటేశ్వరరావు వినతి పత్రం అందజేశారు. శనివారం నూతనంగా నియమితులైన డీఈని కలిసిన వారు పలు సమస్యలను వివరించారు. ప్రధానంగా గాలికొండ పంచాయతీ బోడుదేవుళ్ల గ్రామం, అమ్మవారి ధారకొండ పంచాయతీ సప్పర్ల - పెబ్బంపల్లి రహదారులు, వంచుల పంచాయతీ చామగెడ్డ, నడిమివీధి, గొల్లపల్లి మార్గాల కాలువల వద్ద వంతెనలు నిర్మించాల్సి ఉందని వివరించారు. దీనిపై డీఈ సానుకూలంగా స్పందించారు. ఈకార్యక్రమంలో నాయకులు పొత్తూరు కొండలరావు, ముర్ల భూపతి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలన అందరి బాధ్యత: సీడీపీవో

డుంబ్రిగుడ, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత అని సీడీపీవో నీలిమ అన్నారు. మండలంలోని అరకు పంచాయతీ కేంద్ర ం నేరేడువలస అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాల్యవివాహల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి అతిథిగా సర్పంచి శారద పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాల్యవివాహలు చట్టరీత్యా నేరమన్నారు. చట్టబద్ధంగా పురుషులకు వివాహం చేయాలంటే 21 ఏళ్లు, యువతులకు 18 ఏళ్లు ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఐసీడీసీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకు 25 వేల పీఎం జన్‌మన్ ఇళ్లు మంజూరు

» నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారం రోజుల్లో బిల్లుల చెల్లింపు

» హౌసింగ్ పీడీ బి.బాబు

చింతపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం జన్‌మన్ పథకంలో 25 వేల పక్కా గృహాలు మంజూరయ్యాయని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ బి. బాబు అన్నారు. శనివారం మండలంలోని మడిగుంట, దబ్బగరువు గ్రామాల్లో పక్కా గృహాల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీఎం జన్‌మన్ పథకంలో జిల్లాకు అత్యధికంగా 25 వేల పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.39లక్షలను మంజూరు చేస్తుందన్నారు. ఇప్పటివరకు 98 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. అలాగే పీఎం గ్రామీణ పథకం (పీఎంఏవై) ద్వారా 17,111 పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. ఈ గృహాలకు రూ.1.8లక్షలు మంజూరు చేస్తామన్నారు. ఇప్పటివరకు 2,215 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. డిసెంబరు నాటికి 667 ఇళ్లు పూర్తి చేస్తామని, మార్చి నాటికి లక్ష్యం పూర్తి చేస్తామన్నారు. సకాలంలో ఇళ్లను పూర్తి చేయించేందుకు లబ్ధిదారులతో ఏఈలు, వర్కుఇన్‌స్పెక్టర్లు కృషి చేస్తున్నారన్నారు. నిధుల కొరత లేదని, ఇళ్లు నిర్మించుకున్న వారం రోజుల్లోనే లబ్ధిదారుని వ్యక్తిగత ఖాతాలో నిధులు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ కె.రమణబాబు, వర్కు ఇన్‌స్పెక్టర్ రాజారావు, టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, బీజేపీ మండల అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు.



ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ బాబు

ఈ-కొడిసింగిలో జన్‌మన్ గృహాలకు శంకుస్థాపన

గూడెంకొత్తవీధి: మండలంలోని ఈ-కొడిసింగి గ్రామంలో పీఎం జన్‌మన్ పక్కా గృహాల నిర్మాణాలకు హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ బి. బాబు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ గ్రామంలో 15 మంది ఆదివాసీలకు పక్కా గృహాలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు గృహాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పునాదులు, లింటల్, స్లాబ్ స్థాయిలో బిల్లులు చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ సూరిబాబు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన 'కిడారి'



చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛమిస్తున్న శ్రావణ్‌కుమార్

పాడేరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ శనివారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడుకు ఆయన పుష్పగుచ్ఛం అందించారు.

'వ్యసనాలకు దూరంగా ఉండాలి'

అరకులోయ, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి):వ్యసనాలకు దూరంగా ఉంటూ, జీవితాల్లో స్థిరపడాలని అరకులోయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే భరత్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. కళాశాలలో శనివారం ఎన్‌వైకే విశాఖపట్నం వారి ఆధ్వర్యంలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలను సేవించడం ద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రతి ఒక్కరూ యోగా, క్రీడలు తదితర రంగాలపై దృష్టిసారించాలని కోరారు.ఈ కార్యక్రమంలోని వైస్ ప్రిన్సిపాల్ కే పుష్పరాజు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో నాగబాబు, విజయలక్ష్మి, అనిత, పి.కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న జెన్‌కో అధికారులు

సీలేరు, నవంబరు 2 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు జలవిద్యుత్ కేంద్రం ఆవరణలో శనివారం విజిలెన్సు అవగాహన వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ జెన్‌కో అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పంప్డ్ స్టోరేజీ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ రాజేంద్రప్రసాద్, భాస్కరరావు, ఏఈడీలు టీ అప్పలనాయుడు, జే. శ్రీనివాసరావు, విజిలెన్స్ సిబ్బంది రాజ్‌సుధాకర్, కోటేశ్వరరావు, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ విజేతకు సన్మానం



లోహిత్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

డుంబ్రిగుడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడల్లో బంగారు పతకం సాధించిన గిరిపుత్రుడు లోహిత్‌ను చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ చెట్టి వికాశ్ సన్మానించారు. ఇటీవలరాజమహేంద్రవరం, గుంటూరులలో జరిగిన పోటీల్లో బంగారు పతకాల ను లోహిత్ సాధించా రు. త్వరలో ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరగనున్న పోటీల్లో లోహిత్ పాల్గొననున్నారు.. ఈ నేపథ్యంలోడుంబ్రిగుడలోని నివాస గృహంలో లోహిత్‌ను కలిసి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు సింహాచలం, కృష్ణారావు పాల్గొన్నారు.

చాపరాయి జలవిహారిలో సందడి



చాపరాయిలో జలకాలాడుతున్న పర్యాటకులు

డుంబ్రిగుడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాపరాయి జలవిహారిలో పర్యాటకులు పోటెత్తారు. దేశ, విదేశాలనుంచి కుటుంబ సమేతంగా సందర్శించిన జలపాతంలో సందడి చేశారు. అక్కడి గిరిజన సంప్రదాయ నృత్యాలను తిలకించారు. చిన్నారులు ఆట స్థలంలో సందడి చేశారు. మన్యం అందాలను సెల్‌ఫోన్‌ల్లో బంధించారు.

రూ.11,500 కోట్లతో విశాఖలో మెట్రో మొదటి దశ

» ఫ్లైఓవర్లు లేకుండా డబుల్ డెక్కర్ మోడల్

» ఒకదానిపై రైళ్లు, మరోదానిపై వాహనాలు

» అదనంగా మరో రూ.3 వేల కోట్ల వ్యయం

» పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి):విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టు మొదట దశ పనులు రూ.11,500 కోట్లతో చేపట్టనున్నామని పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ వెల్లడించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం ఆయన, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామితో కలిసి జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, ఇటీవలే ఢిల్లీ వెళ్లి మెట్రో రైలు ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పించామన్నారు. అయితే నగరంలో పది చోట్ల ఫ్లైఓవర్లు నిర్మించాల్సిన అవసరం ఉందని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ చెప్పారని, అయితే వాటి అవసరం లేకుండా మెట్రో ప్రాజెక్టులోనే డబుల్ డెక్కర్ విధానంలో ఒక దానిపై రైళ్లు, మరో దానిపై వాహనాలు వెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. దీనికి అదనంగా మరో రూ.3 వేల కోట్లు అవసరం అవుతాయని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం అన్ని శాఖల నిధులను దారిమళ్లించిందని ఆరోపించారు.

తురువోలు శివాలయానికి దారేది..?

» భక్తులకు రోడ్డు సదుపాయం శూన్యం » పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు » ఏటా భక్తులకు తప్పని ఇక్కట్లు

చీడికాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శతాబ్దాలుగా పూజలు అందుకొంటున్న ఉమామహేశ్వర మల్లికార్జునస్వామిని దర్శించుకునే మార్గం భక్తులకు కరవవుతోంది. ఎటువంటి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆలయానికి వెళ్లడానికి వారికి ఇబ్బందులు తప్పడం లేదు. అయినప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు కనీసం పట్టించుకోకపోవడం విచారకరం.

మండలంలోని తురువోలు గ్రామంలో సుమారు మూడు వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఈ గ్రామం మెయిన్ రోడ్డుకు సుమారు 400 మీటర్ల దూరంలో శివాలయం ఉంది. ఆలయానికి చుట్టూ ప్రహరీ, ధ్వజస్తంభం, నవగ్రహాలు, షిర్డీసాయి విగ్రహం, పూజలు చేసే బ్రాహ్మణుడికి విశ్రాంతి భవనం, ఈశాన్యభాగంలో ఒక మంచినీటి బోరు, శివాలయానికి ఆనుకొని దక్షిణభాగాన ఒక ఎకరం విస్తీర్ణంలో పచ్చదనంతో


శివాలయం పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన తుప్పలు

ఆహ్లాదకరంగా స్థలం కూడా ఉన్నాయి. ఈ దేవాలయానికి కార్తీక మాసంలో తురువోలుతో పాటు పరిసర గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు తరలిస్తున్నారు. మిగతా రోజుల్లో కూడా శివాలయానికి వచ్చి పూజలు చేస్తారు. ఈ ఖాళీ స్థలంలో గ్రామస్థులు వివాహం నిర్వహించేందుకు కల్యాణ మండపం నిర్మాణానికి అప్పటి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.9 లక్షలు మంజూరు చేయడంతో కొంతవరకు నిర్మాణం చేపట్టి, అసంపూర్తిగా వదిలేశారు. ఈ ఖాళీ స్థలంలో చెట్ల కింద ప్రతీ ఏడాది కార్తీకమాసంలో ప్రతీ రోజు అన్నసమారాధనలు నిర్వహిస్తుంటారు. సదుపాయాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

శివాలయ రోడ్డుకు సహకారం కరువు

తురువోలు గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు పలువురు దాతలు ఎకరాల భూమిని దానం చేయగా, ఈ శివాలయానికి రోడ్డు కోసం ఆరు సెంట్లు ఇవ్వడానికి దాతలు ముందుకు రాకపోవడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 50 సంవత్సరాల క్రితం జిల్లా పరిషత్ హైస్కూల్ ఏర్పాటుకు స్థలం కావాలని అధికారులు కోరగా, అప్పట్లో భూస్వామి పాత్రిని సింహాచలంనాయుడు తాతయ్య కుటుంబం ఐదు ఎకరాలను ఉచితంగా ఇచ్చారు. తులసీ కల్యాణ మండపం ఏర్పాటుకు ముర్రు అప్పడమ్మ దంపతులు 20 సెంట్లు, రైతు సేవా కేంద్రం, వైద్య ఆరోగ్య భవనాల నిర్మాణానికి పోతల పైడితల్లిబాబు కుటుంబీకులు 15 సెంట్ల సొంత స్థలాలను ఉచితంగా అందించారు. కానీ ఈ శివాలయానికి రహదారి ఏర్పాటుకు ఎవరూ ముందుకు రాకపోవడం విచారకరం.

అలాగే శివుని ఆశీస్సులతో విద్య, వైద్య, హోం, న్యాయ, పంచాయతీరాజ్, సహకార శాఖల్లో రాష్ట్ర స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నవారితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఇంటికొకరు చొప్పున గ్రామంలో 65 శాతం మంది ఉద్యోగులు ఉన్నారు. ఇదే గ్రామానికి చెందిన పాత్రిని సింహాచలంనాయుడు రెండుసార్లు ఎంపీపీగాను, పోతల చిన్నమ్మ ఒకసారి ఎంపీపీగా పనిచేశారు. ప్రస్తుతం లాలం శారదవరలక్ష్మి జడ్పీటీసీగా పనిచేస్తున్నారు. మాడుగుల ఎమ్మెల్యేగా పోటీచేసి భారీ విజయం సాధించిన బండారు సత్యనారాయణమూర్తి సైతం ఇదే గ్రామంలో నామినేషన్ వేసినప్పటి నుంచి గెలుపొందేవరకూ నివాసం ఉన్నారు. ఇలాంటి మహోన్నతమైన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, విద్యావంతులు, దాతలు ఉన్న గ్రామంలో శివాలయానికి ఆరు సెంట్లు ఇవ్వడానికి ముందుకు రాకపోవడం విచారకరం. ఫలితంగా ప్రతీ ఏటా కార్తీక మాసంలో శివుని దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు తప్పడం లేదు. ఎప్పటికైనా ఉద్యోగులు, దాతలు స్పందించాలని భక్తులు ఎదురుచూస్తున్నారు.



తురువోలు శివాలయం.... (ఇన్‌సెట్‌లో) అసంపూర్తి నిర్మాణంలో నిలిచిపోయిన భవనం

సీఎం చంద్రబాబును కలిసిన తాతయ్యబాబు



బుచ్చెయ్యపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పర్యటనకు శనివారం వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఏపీ రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ ఛైర్మన్, అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు కలిశారు. హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందించి చంద్రబాబుకు స్వాగతం పలికారు.

మాడుగుల సమస్యలపై చంద్రబాబుకు వినతి


చంద్రబాబుకు వినతి అందిస్తున్న నేతలు

మాడుగుల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాడుగుల సమస్యలపై సీఎం చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం అందించినట్టు టీడీపీ మాడుగుల పట్టణ అధ్యక్షుడు వద్దాది రంజిత్‌వర్మ తెలిపారు. మాడుగుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, రిజర్వేయర్ పనులు పూర్తిస్థాయిలో చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ విశాఖ వచ్చిన చంద్రబాబుకు వినతిపత్రాన్ని అందించానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు లెక్కల కాశిబాబు, సూర్యనారాయణరాజు, మరువాడ ఈశ్వర్రావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థినుల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు

మాడుగుల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు. హరిపాలెం జడ్పీ హైస్కూల్‌లో గత నెల 29న జరిగిన పోటీల్లో పదో తరగతి విద్యార్థిని గుణసాయి రమ్య అండర్-17 విభాగంలోను, తొమ్మిదో తరగతి విద్యార్థిని గీతామాధురి అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం జగన్‌మోహన్ నాయుడు తెలిపారు. విద్యార్థినులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన పీడీ వెంకటరావును సర్పంచ్ సింహాచలంనాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

చోద్యం పాఠశాల నుంచి మరో విద్యార్థిని..


విద్యార్థిని గీతిక

కృష్ణాదేవిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం చోద్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.గీతిక రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో ఎంపికైనట్టు హెచ్ఎం పి.శ్రీనివాసరావు, పీఈటీ కుందూరు నూకరాజు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి అండర్-14 పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈ పోటీలకు ఎంపికైందన్నారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ పోతల సత్తిబాబు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు గీతికను అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీలకు వేచలం విద్యార్థులు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దేవరాపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వేచలం విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం డి.నరసింహమూర్తి తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ మెడికల్ గ్రౌండ్స్‌లో గత నెల 30న జరిగిన ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో బి.చైతన్య ట్రిబుల్‌జంప్, లాంగ్ జంప్‌లో, జిసుధ 400 మీటర్ల హర్డిల్స్‌లోను, అండర్-17 బాలుర విభాగంలో టి.రవిశంకర్ ఐదు కిలోమీటర్ల రేస్‌వాక్‌లోను, వి.నారిబాబు హైజంప్, 400 మీటర్లు హర్డిల్స్‌లో ప్రతిభ కనబరించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శ్రీకాకుళంలో ఆదివారం నుంచి జరగనున్న పోటీల్లో వారు పాల్గొంటారు. పీడీ తమ్మునాయుడు, విద్యార్థులను అభినందించారు.

నిరుద్యోగుల స్వయం ఉపాధికి సర్వే


సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందర్రావు

చీడికాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చదువుకొని ఖాళీగా ఉన్న యువతీ, యువకులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంపీడీవో వి.హేమసుందర్రావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 నుంచి 60 ఏళ్ల లోపు ఉన్న నిరుద్యోగులను గుర్తించేందుకు ఈ నెల 4 నుంచి 17వ తేదీ వరకూ గ్రామాల్లో సర్వే చేస్తారన్నారు. విద్యాపరంగా, సాంకేతికపరంగా వారు ఏ స్థాయిలో ఉన్నారన్న 85 అంశాలపై సర్వే చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ సదస్సులో ఈవోపీఆర్డీ ఎం.కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలపై అదనపు భారం

» సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత శంకరరావు

నర్సీపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తలు అదనపు పని భారంతో ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆశ వర్కర్ల సంఘం జిల్లా కమిటి సభ్యురాలు ఎం.సత్యవతి అధ్యక్షతన శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్‌చార్ట్‌లో లేని పనులు కూడా చేయిస్తున్నారన్నారు. స్వచ్ఛత హీ సేవా, సబ్ సెంటర్లలో ఎంపీహెచ్‌వో వద్ద డ్యూటీలు సర్వేలు చేయిస్తున్నారన్నారు. వారికి కనీస వేతనాలు, ఉద్యోగ విరమణ సమయంలో సౌకర్యాలు, పెన్షన్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు పాల్గొన్నారు.

ఖండివరంలో పారిశుధ్య కార్యక్రమం

చీడికాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖండివరం గ్రామంలో శనివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఖండివరం సంపద తయారీ కేంద్రం ఆవరణలో తుప్పలను తొలగించారు. పారిశుధ్యం మెరుగుకు ఉద్యోగులతో మహిళా సంఘాలు, రైతులు ముందుకురావాలని సర్పంచ్ ఎస్.లక్ష్మి కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గెంజి స్వాతి, కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, సచివాలయ కార్యదర్శి పద్మావతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.1.96 కోట్లు: డీఈఈ విద్యాసాగర్


మెయిన్ రోడ్డు మరమ్మతు పనులు పరిశీలిస్తున్న డీఈఈ

నర్సీపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతుల కోసం రూ.1.96 కోట్లు మంజూరయ్యాయని డీఈఈ ఆర్ఆర్.విద్యాసాగర్ తెలిపారు. శివపురం-కృష్ణాదేవిపేట రోడ్డులో టీడీపీ నాయకుడు పైల గోవిందరావు శనివారం మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నిధులతో నెల రోజుల్లో మరమ్మతు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. టీడీపీ నేత గోవిందరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రహదారుల్లో ఏర్పడ్డ గుంతల వల్ల పలు ప్రమాదాలు జరిగేవని, కనీసం మరమ్మతులు చేయించలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గుంతల రోడ్ల మరమ్మతులు చేయించాలని నిర్ణయం తీసుకొని నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం అర్బన్ ఆర్అండ్‌బీ జేఈఈ కె.నారాయణ రెడ్డి, కృష్ణాదేవిపేట జేఈఈ ప్రసాద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ వాహనాలు ఖాళీ చేయించండి

నర్సీపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ స్టేషన్ దాటిన తర్వాత ఆర్అండ్‌బీ రోడ్డుకిరువైపులా ఉంచిన సీజ్‌డ్ వాహనాలు తక్షణమే ఖాళీ చేయించాలని సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్ ఎక్సైజ్ ఎస్ఐకు లిఖిత పూర్వంగా ఆదేశాలు జారీ చేశారు. శనివారం న్యాయమూర్తి ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రోడ్డుకిరువైపులా ఉన్న వాహనాలు ఖాళీ చేయించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని హెచ్చరించారు. కళాశాలకు వెళ్లే దారిలో బాలికలు ఈవ్‌టీజింగ్ గురవుతున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి ఆదేశించారు. కళాశాలల వద్ద పోలీసులు నిఘా కట్టుదిట్టం చేసి ఆకతాయిలను కఠినంగా శిక్షించాలని ఆయన సూచించారు.

స్వయంభూ గౌరీశ్వరాలయం ఉత్సవ కమిటీ నియామకం


కమిటీ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు, జనసేన నేత రమేష్

చోడవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా స్వయంభూ గౌరీశ్వరాలయానికి 36 మందితో కూడిన ఉత్సవ కమిటీని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఖరారు చేశారు. ఈ కమిటీ ఆలయ ప్రాంగణంలో శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించింది. కమిటీ ఛైర్మన్‌గా గూనూరు సురేష్‌ను నియమించారు. సభ్యులుగా వేదుల నాగేశ్వరరావు, గొల్లు ఉమామహేశ్వరి, గొర్రుపోటు ఈశ్వరరావు, రావాడ శివ, సింగంపల్లి వెంకటరావు, మీసాల శ్రీను, గండి శ్రీను, నౌడు ప్రసాద్, పొన్నాడ శ్రీనివాసరావు, పరిటి సరస్వతి, పిల్లి అర్జున్‌శ్రీనివాసరావు, కర్రి నాయుడు, బిక్కవోలు చిట్టిబాబు, గూనూరు గణేష్, గూనూరు కనకమహాలక్ష్మి, డి.బాబు. ఎన్.లక్ష్మణరావు, బి.వెంకటేశ్వరరావు, బీవీ.స్వామి, డి.లక్ష్మి, సి.భాస్కరరావు, కె.బలరాం, బి.పురుషోత్తం, ఎస్.అప్పలరాజు, సిహెచ్.కృష్ణ, కేఎస్.కుమార్, పి.శంకర్. బి.రామకృష్ణ, వై.మోహనరావు, బి.చంద్రశేఖర్, జె.నాగేంద్ర, విజయలక్ష్మి నియమితులయ్యారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వయంభూ గౌరీశ్వరాలయం మరింత అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే రాజు ఆకాంక్షించారు. ఈ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో నాయకులు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, జనసేన జిల్లా కార్యదర్శి సిరిపురపు రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు గూనూరు మూలినాయుడు, టీడీపీ నాయకులు గూనూరు లక్ష్మీనారాయణ, సకురు కోటేశ్వరరావు, సేనాపతి శ్రీనివాసరావు, పి.నాయుడు, ఆలయ ఈవో సత్యనారాయణ, అర్చకులు కొడమంచిలి చలపతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

బుచ్చెయ్యపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేల్లో తలెత్తిన సమస్యల పరిష్కారానికే గ్రామ రెవెన్యూ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎం.లక్ష్మి చెప్పారు. మండలంలోని దిబ్బిడి గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. రీ సర్వేలో భాగంగా భూముల వివరాలు తప్పుగా నమోదైనా, భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉన్నా, ఒకరి భూమి మరొకరి పేరు మీద పొరపాటుగా నమోదైనా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సభలో వైస్ ఎంపీపీ గొంపా వెంకటేశ్వరరావు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, ఆర్ఐ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కండి: తహసీల్దార్


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

రావికమతం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికల కోసం ఉద్యోగులు సిద్ధం కావాలని తహసీల్దార్ బి.వెంకటరమణ ఆదేశించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 13 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. వీటిలో కల్యాణపులోవ, కామునిగెడ్డ, కొత్తకోట ముంత మామిడికట్టు, పెద్దకట్టు, వారకట్టు, సంత కట్టులతో పాటు పెద్దేరు కుడి కాలువకు సంబంధించి-1, 2తో పాటు మరో ఆరు చెరువులు ఉన్నాయని చెప్పారు. ఆయా సంఘాల ఆయకట్టు పరిధిలోని వీఆర్వోలు ఈ నెల 6 నుంచి 10వ తేదీలోగా ఓటర్ల జాబితా తయారు చేయాలని తహసీల్దార్ ఆదేశించారు. ఆయకట్టుదారు ఓటరు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. తయారు చేసిన ఓటర్ల జాబితాను ఈ నెల 10, 12 తేదీలలో గ్రామ సచివాలయాలలో ప్రదర్శించాలని ఆదేశించారు. జాబితాలో తేడాలు, అభ్యంతరాలు ఉంటే సంబంధిత రైతుల నుంచి ఈ నెల 13న ఫిర్యాదులను స్వీకరించి. తప్పులు ఉంటే సవరణలు చేసి తుది జాబితా ఖరారు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ జి.అప్పలనాయుడు, రీ సర్వే డీటీ నానాజీ, ఆర్ఐ సతీశ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నసమారాధన


స్వాములకు భిక్ష వడ్డిస్తున్న విజయ్

నర్సీపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో మాలా ధారణలో ఉన్న స్వాములకు (భిక్ష) అన్న సమారాధన కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ శనివారం ప్రారంభించారు. ప్రతి ఏటా కార్తీక మాసం నెల రోజులు ఆలయంలో స్వాములకు భిక్ష ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. రోజుకో దాత ముందుకు వచ్చి నెల రోజుల పాటు స్వాములకు భిక్ష ఏర్పాటు చేస్తుంటారు. ఇందులో భాగంగా కార్తీక మాసం మొదటి రోజు విజయ్ భిక్ష ఏర్పాటు చేసి స్వాములకు స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలకు అనేక రాయితీలు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉద్యానవన అధికారి శిరీషా

గొలుగొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటల సాగు కోసం ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తున్నదని ఉద్యానవన అధికారి శిరీషా తెలిపారు. మండలంలోని పాకలపాడు గ్రామంలో శనివారం ఉద్యానవన పంటలు సాగు చేస్తున్న రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్ పామ్ మొక్కలు ఉచితం అందిస్తున్నట్టు చెప్పారు. అలాగే ఎరువులపై 50 శాతం రాయితీ ఇస్తున్నదన్నారు. జీడిమామిడి, మామిడి, బొప్పాయి, కొబ్బరి తదితర ఉద్యానవన పంటలకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తున్నదని, ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆయిల్ పామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ రమేశ్, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌టీఐతో కావాల్సిన సమాచారం పొందవచ్చు

రావికమతం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ద్వారా కావాల్సిన సమాచారం పొందవచ్చని మండల వ్యవసాయాధికారి డి.రూప చెప్పారు. మండల వ్యవసాయ కార్యాలయంలో శనివారం రైతులు, ప్రజా ప్రతినిధులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరమన్నారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వ అనుబంధ, సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని పొందవచ్చన్నారు. ఎస్సీ ఎస్టీలు, తెల్ల రేషన్ కార్డుదారులు ఎటువంటి రుసుం లేకుండా సమాచారం పొందవచ్చున్నారు. సమాచారం కోసం దరఖాస్తుతో ఆధార్ కార్డు జతచేయాలని సూచించారు. నిబంధనలకు లోబడి 30 రోజుల్లో కోరిన సమాచారం ఇవ్వాల్సి ఉందని స్పష్టం చేశారు. ఈ సదస్సులో ఎంపీపీ పైల రాజు, రావికమతం ఎంపిటీసీ సభ్యురాలు వేపాడ లక్ష్మి పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏవో రూప

గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలి


పారిశుధ్య కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మాకవరపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి సూచించారు. పైడిపాల, బూరుగుపాలెం, భీమబోయినపాలెం, తూటిపాల, తాడపాల, పెద్దిపాలెం, శెట్టిపాలెం, జడ్.గంగవరం, రాచపల్లి గ్రామాల్లో శనివారం స్వచ్ఛత హీ సేవా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ శనివారం పరిశుభ్రత పాటించాలన్నారు. సంపద కేంద్రాల వద్ద ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

దుర్గాదేవి ఆలయంలో ఆకాశదీపం


చోడవరం దుర్గమ్మ సన్నిధిలో ఆకాశ దీపం ప్రారంభిస్తున్న అర్చకులు

చోడవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా పట్టణంలోని దుర్గాదేవి ఆలయంలో శనివారం తెల్లవారు ఆకాశ దీపం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శివ, భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని ఆపదహర వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి ఆకాశ దీపం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కందర్ప శంకర్, అర్చకులు శాంతారామాచార్యులు పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యలపై 64 దరఖాస్తులు


గ్రామసభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

గొలుగొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఅండ్‌డీ.పాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో 64 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కొండబాబు, వీఆర్వో పడాల్, మండల సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

తురకలపూడిలో బోరు రిగ్గింగ్ పనులు

బుచ్చెయ్యపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకలపూడి గ్రామంలో చేతిబోరు రిగ్గింగ్ పనులను జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణకు తన కోటా నిధులతో అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కోరుకొండ అప్పలనాయుడు, గోపిశెట్టి శ్రీనివాసరావు, ముచ్చకర్ల శ్రీను, పి.మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

కటౌట్ ధ్వంసంపై చర్యలు తీసుకోండి

రోలుగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శరభవరం పంచాయతీ శివారు రాజన్నపేట గ్రామంలో దళిత దివంగత నేత బెందరి రాము కటౌట్ ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన భార్య లక్ష్మి, కుటుంబీకులు తెలిపారు. గ్రామానికి చెందిన కొంత మంది అగ్రకులస్థులు కావాలనే తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. గ్రామంలో ఇరు వర్గాల మధ్య గొడవలు సృష్టించాలనే ఉద్దేశంతోనే కటౌట్‌లు ధ్వంసం చేశారని బాధితులు ఆరోపించారు. ఈ ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఐ, సీఐ, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు వారు చెప్పారు.

స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని, కర్మాగారాన్ని వదులుకునే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం రాత్రి కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాటాలతో ఏర్పాటైన స్టీల్‌ప్లాంటును రక్షించుకునేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. గతంలో ఇలాంటి ప్రతిపాదన వచ్చినప్పుడు అప్పటి వాజపేయి ప్రభుత్వంతో మాట్లాడి ప్లాంటు ప్రైవేటుపరం కాకుండా చూసినట్టు చెప్పారు. రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ పూర్తవుతోందని, కొద్దిరోజుల్లోనే భూమిపూజ చేస్తామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వ లోపాలను సరిదిద్దుతూ రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. తమపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయబోమని స్పష్టం చేశారు. గడిచిన ఐదేళ్ల సమాజాన్ని జగన్ అతలాకుతలం చేశాడని, విశాఖను పూర్తిగా కబ్జా చేశాడని విమర్శించారు. విశాఖ ప్రజలు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి సృష్టించాడన్నారు. విశాఖలో రాజధానిని పెడతామంటే ఇక్కడి ప్రజలు నిర్మొహమాటంగా తిరస్కరించారని, టీడీపీకి ఓట్లేసి తమ నిర్ణయాన్ని స్పష్టం చేశారని చంద్రబాబు పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి దొంగ వేషాలు ఇక్కడి ప్రజలు గుర్తించారన్నారు. ప్రజలు ఆస్తులు, డబ్బుతో ప్యాలెస్‌లు కడతావా..? అంటూ జగన్‌ను చంద్రబాబు ప్రశ్నించారు. ప్యాలెస్‌లోని టాయ్‌లెట్లు, బెడ్‌రూమ్‌లు చూస్తే కళ్లు తిరిగాయని, తనకేమీ అర్థం కాలేదన్నారు. ఆ భవనంలో ఏర్పాటుచేసిన ఫ్యాన్లను తానెక్కడా చూడలేదని ఈ సందర్భంగా చంద్రబాబు పేర్కొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

తెలుగుదేశం పార్టీకి ఆదర్శవంతమైన కార్యకర్తలుండే జిల్లా విశాఖ అని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఈ జిల్లాను టీడీపీకి కంచుకోటగా నిలబెట్టారని, పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలోనూ కార్పొరేటర్లను గెలిపించారని ఒకింత చంద్రబాబు భావోద్వేగానికి గురయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లోనూ ఎంపీ, ఎమ్మెల్యేలకు పార్టీ మెజారిటీలను అందించి పెట్టారన్నారు. పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలు గురించి తాను ఆలోచిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యకర్తలను ఎలా ఆదుకోవాలనే దానిపై స్పష్టతతో ఉన్నానని వివరించారు. పార్టీ కోసం పనిచేసిన అందరికీ తాను పదవులు ఇవ్వలేకపోయినప్పటికీ మంచి భవిష్యత్తును అందిస్తానని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. పాలనలో భాగస్వామ్యం కల్పిస్తామని వెల్లడించారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను ఆర్థికంగా పైకి తీసుకువచ్చే అవకాశాలపై దృష్టి సారిస్తామన్నారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి ఐదు లక్ష రూపాయలు ఇన్సూరెన్స్ కల్పిస్తున్నట్టు తెలిపారు. గతంలో రూ.రెండు లక్షలు ఉండగా, దాన్ని రూ.ఐదు లక్షలకు పెంచినట్టు తెలిపారు. అలాగే, పార్టీ తరఫున మట్టి ఖర్చులకు పది వేలు అందిస్తున్నామని, పిల్లలు చదువులకు సాయం చేస్తున్నట్టు వెల్లడించారు. పార్టీ పటిష్ఠంగా ఉండాలంటే సభ్యత్వం చాలా కీలకమని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టిసారించాలని సూచించారు. సభ్యత్వాలు పూర్తయిన తరువాత కమిటీలను ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. పటిష్ఠమైన విధానాన్ని ఇందుకోసం అవలంబించనున్నట్టు వెల్లడించారు. కమిటీలు నియమించిన తరువాత ఎమ్మెల్యేలు, మంత్రులు ఆ కమిటీలు సూచించిన పనులు చేసేలా దిశానిర్దేశం చేస్తామని స్పష్టంచేశారు. ఆలస్యమైనప్పటికీ కార్యకర్తలను కలిసి వెళ్లాలన్న ఉద్దేశంతోనే కార్యాలయానికి వచ్చినట్టు చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, శాసన మండలి సభ్యులు వేపాడ చిరంజీవి రావు, దువ్వారపు రామారావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు విస్తృత పర్యటన



పరవాడలో రహదారిని పరిశీలిస్తున్న చంద్రబాబు, చిత్రంలో అనిత, పంచకర్ల, బండారు



రుషికొండ ప్యాలెస్ లోపల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబునాయుడు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉమ్మడి విశాఖ జిల్లాలో శనివారం విస్తృతంగా పర్యటించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరవాడ సినిమా హాల్ జంక్షన్‌లో జరిగిన మిషన్ ఫర్ పాట్ హోల్‌ఫ్రీ రోడ్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రారంభ కార్యక్రమం, సమావేశంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా హెలికాప్టర్‌లో రుషికొండకు చేరుకున్నారు. సుమారు గంటన్నర సేపు భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. సాయంత్రం 5 గంటలకు ఆయన కలెక్టరేట్‌కు చేరుకొని మూడు జిల్లాల అధికారులతో రాత్రి 9.45 గంటల వరకు సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్కడి నుంచి పందిమెట్టలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. - అనకాపల్లి/విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



పరవాడలో ఏర్పాటు చేసిన అధ్వాన రహదారుల ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబునాయుడు



మిషన్ ఫర్ పాట్ హోల్‌ఫ్రీ రోడ్స్ ఇన్ ఏపీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



రుషికొండపై నిర్మించిన ప్యాలెస్ లోపల నుంచి బయటకు చూస్తున్న సీఎం



రుషికొండ ప్యాలెస్ నుంచి సముద్ర తీరాన్ని తిలకిస్తున్న ముఖ్యమంత్రి



రోడ్డు రోలర్ నడిపి పరవాడలో రహదారి గోతులు పూడ్చివేత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చంద్రబాబు



టీడీపీ కార్యాలయంలో రన్ ఫర్ అంబేడ్కర్ పోస్టరును ఆవిష్కరిస్తూ..



విశాఖలోని టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు



పరవాడలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ప్రజానీకం

ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం

- జిల్లాలో స్పోర్ట్స్ విలేజి ఏర్పాటుకు చర్యలు
- త్వరలో స్పోర్ట్స్ పాలసీల ప్రకటన
- శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్ రవి నాయుడు

తుమ్మపాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని, క్రీడలతో ఏపీని ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టి చరిత్ర సృష్టించాలన్నదే ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ క్రీడా మైదానంలో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ రాష్ట్రస్థాయి ఖోఖో చాంపియన్ షిప్ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత 13 జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించిన అనంతరం ప్రార్థనా గీతాన్ని ఆలపించి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవినాయుడు స్థానిక ముఖ్య నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఖోఖో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో త్వరలోనే స్పోర్ట్స్ విలేజిని ఏర్పాటు చేసి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. జిల్లాలోని ప్రతీ నియోజకవర్గంలో కేవీకేలు, ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాల నిర్మాణాలకు చర్యలు చేపడతామన్నారు. క్రీడారంగం అభివృద్ధికి పీపీపీ విధానం, సీఎస్ఆర్ ఫండ్స్ సేకరణకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, శాప్ అధికార యంత్రాంగం కూడా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ముందు పలువురు విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీఓ ఎల్వీ రమణ, ఖోఖో పోటీల అబ్జర్వర్ ఎమ్వీఎస్ ప్రసాద్, వి.నాయుడు, కేఎం నా యుడు, అనకాపల్లి నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విశాఖకు ఔటర్ రింగ్

... 5వ పేజీ తరువాయి

భోగాపురం విమానాశ్రయం పూర్తవుతుందని, అప్పటికి అన్ని అభివృద్ధి ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థ పక్కాగా ఉండాలని, లిక్విడ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ అందుబాటులోకి తేవాలని సూచించారు. విశాఖ నగర అవసరాలు తీరే విధంగా అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పంటలు సాగు చేయించాలని అధికారులకు సూచించారు. గోదావరి నీటిని తీసుకురావడం ద్వారా విశాఖ తాగునీటి కష్టాలు తీరతాయన్నారు. సూర్యఘర్ పథకంలో భాగంగా ప్రతి ఇంట్లో 200 యూనిట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి జరగాలన్నారు. టాటా, జీఎంఆర్ సంస్థలను మెంటార్లుగా తీసుకొని ముందుకుసాగాలన్నారు. విశాఖ జనాభా ప్రస్తుతం 26 లక్షలని, ఉత్తరాంధ్ర జిల్లాలను కలుపుకొంటే 50 లక్షలు ఉంటుందని, ఈ జనాభా కోటికి పెరగాలన్నారు.

అధికారులకు ప్రజాప్రతినిధులు సహకరించాలి

జిల్లాల్లో అధికారులు చేపట్టే అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించారు. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి గురించి ప్రస్తావించగా, దానికి భూ సేకరణ సమస్యగా మారిందనే అభిప్రాయం వ్యక్తమైంది. అలాకాకుండా పరవాడ నుంచి కొండకర్ల ఆవ మీదుగా ఏపీఐఐసీ సెజ్‌కు గ్రీన్‌ఫీల్డ్ రహదారి వేసుకోవచ్చునని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సూచించగా, అది పీపీపీలో చేయగలిగితే ముందుకు వెళ్లాలని సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. విశాఖలో ఇసుక అమ్మకాలపై చర్చ రాగా గతంలో టన్ను రూ.1,390కు ఇచ్చేవారని, ఇప్పుడు రూ.1,200కు ఇస్తున్నామని కలెక్టర్ వివరించారు. సంక్రాంతి తరువాత ఎక్కడైనా గుంతలు కనిపించినా, ఫిర్యాదు వచ్చినా సంబంధిత అధికారిని సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. అచ్యుతాపురంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. అలాగే ఎలమంచిలి ప్రాంతంలో ఫర్నిచర్ పార్క్ ఏర్పాటు చేయాలని సుందరపు విజయకుమార్ కోరగా, మాడుగులలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యే బండారు కోరారు.

విశాఖ అంటే ప్రత్యేక అభిమానం

విశాఖపట్నం అంటే తనకు ప్రత్యేక అభిమానం అని, ఈ నగరానికి ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. విశాఖ ప్రజలకు విజ్ఞత ఎక్కువని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో అది మరింత ప్రస్ఫుటం అయిందన్నారు. సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, నారాయణ, కొల్లు రవీంద్ర, కందుల దుర్గేశ్, డోలా బాలాంజనేయ స్వామి, ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, గొల్ల బాబూరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు హరేంధిర ప్రసాద్, దినేశ్‌కుమార్, విజయకృష్ణన్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, మూడు జిల్లాల జాయింట్ కలెక్టర్లు పాల్గొన్నారు.

మెట్రోకెమ్ ఫార్మాలో పేలుడు

... 5వ పేజీ తరువాయి

నలుగురు కార్మికులు గాయపడ్డారని, అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారని చెబుతున్నారు. తానాం గ్రామానికి చెందిన పలువురు యువకులు కంపెనీ వద్దకు చేరుకుని యాజమాన్యం తీరు పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రమాదం ఎలా జరిగిందో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కాగా ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పరవాడ సీఐ మల్లికార్జునరావు స్థానిక విలేకరులకు వెల్లడించారు. ప్రమాదం కారణంగా బ్లాక్ పూర్తిగా ధ్వంసమైనట్టు సమాచారం. ప్రమాద జరిగిన సమయంలో అక్కడ పనిచేస్తున్న కొంతమంది కార్మికులు పైపులైన్ల ద్వారా కిందకు దిగి ప్రాణాలు రక్షించుకున్నట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

... 5వ పేజీ తరువాయి

నడుపుతున్న మేరుగు మహాలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా, కిరణ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే పదుల సంఖ్యలో జనం గుమిగూడారు కానీ క్షతగాత్రుడైన కిరణ్‌ను ఆస్పత్రికి తరలించడానికి ఎవరూ ముందుకు రాలేదు. పోలీసులకు విషయం తెలియడంతో సీఐ గణేశ్ సిబ్బందితో వెళ్లి తీవ్రంగా గాయపడిన కిరణ్‌ను వడ్లపూడిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇద్దరూ అవివాహితులే. ఇందులో మహాలక్ష్మి సెజ్‌లో గల ఒక కర్మాగారంలో ఉద్యోగి కాగా, కిరణ్ అచ్యుతాపురంలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న కిరణ్ పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. ఇద్దరూ ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

రూ.11,500 కోట్లతో మెట్రో మొదటి దశ

- ఫ్లైఓవర్లు లేకుండా సిటీలో డబుల్ డెక్కర్ మోడల్
- ఒకదానిపై రైళ్లు, మరోదానిపై వాహనాలు
- అదనంగా మరో రూ.3 వేల కోట్ల వ్యయం
- పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ

విశాఖపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టు మొదట దశ పనులు రూ.11,500 కోట్లతో చేపట్టనున్నామని పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ వెల్లడించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం ఆయన, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామితో కలిసి జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, ఇటీవలె ఢిల్లీ వెళ్లి మెట్రో రైలు ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పించామన్నారు. అయితే నగరంలో పది చోట్ల ఫ్లైఓవర్లు నిర్మించాల్సిన అవసరం ఉందని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ చెప్పారని, అయితే వాటి అవసరం లేకుండా మెట్రో ప్రాజెక్టులోనే డబుల్ డెక్కర్ విధానంలో ఒక దానిపై రైళ్లు, మరో దానిపై వాహనాలు వెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. దీనికి అదనంగా మరో రూ.3 వేల కోట్లు అవసరం అవుతాయని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం అన్ని శాఖల నిధులను దారిమళ్లించిందని ఆరోపించారు.

చంద్రబాబుపై అమితమైన అభిమానం

పరవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఓ మహిళా అభిమాని ఆప్యాయంగా హత్తుకున్న సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పరవాడలో శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరయ్యారు. వేదిక వద్దకు వెళుతుండగా పరవాడకు చెందిన ఓ మహిళ ఆయనను ఆప్యాయంగా హత్తుకున్నారు. అక్కడే ఉన్న సెక్యూరిటీ ఆమెను అడ్డుకునేందుకు ప్రయత్నించగా సీఎం వారించారు. ఆమె వైసీపీ నాయకుడి సతీమణి అని తెలిసింది.



మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న చంద్రబాబు

కూరగాయల మార్కెట్లో కారు బీభత్సం

... 5వ పేజీ తరువాయి

కారును వెంబడిస్తూ నర్సీపట్నం వరకు వచ్చారు. కారు అతివేగంగా నడపడంతో సుమారు 15 కిలోమీటర్లు పోలీసులు ఛేజ్ చేయాల్సి వచ్చింది.

5 కిలోల గంజాయి స్వాధీనం

స్థానిక డిగ్రీ కళాశాల వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులోంచి నలుగురు వ్యక్తులు దిగి పారిపోవడానికి ప్రయత్నించారని, వారిలో ఒక యువకుడిని అదుపులోకి తీసుకున్నామని పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. కాకినాడకు చెందిన రేవళ్ల నాగబాబును అరెస్టు చేసి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని కారును సీజ్ చేశామని తెలిపారు. అయితే మార్కెట్లో జరిగిన సంఘటనను పోలీసులు ఎందుకు మార్చి చెప్పాల్సి వచ్చిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఆగని ఇసుక దందా

... 5వ పేజీ తరువాయి

కనీస చర్యలు తీసుకోకపోవడం అనుమానా లకు తావిస్తోంది. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ఇసుక అక్రమ వ్యాపారం యథేచ్ఛగా చేస్తున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులు కింద స్థాయి సిబ్బందిని అక్కడికి పంపి చేతులు దులిపేసుకుంటున్నారు. కింద స్థాయి సిబ్బంది మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారని, అధికారులకు కూడా ఇందులో వాటా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని మండల వాసులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554